

నేడు కలెక్టరేట్‌లో స్పందన

రాజమహేంద్రవరం రూరల్ ,మార్చి 3: రాజమహేంద్రవరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం యథాతథంగా జరుగుతుందని కలెక్టర్ మాధవీలత తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్పందన జరుగుతుందన్నారు. కలెక్టరేట్, రెవెన్యూ కార్యాలయాలు, మండల కార్యాలయాలు, సచివాలయాలు, మునిసిపాలిటీల్లో స్పందన నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎంపీగారూ.. ఏం చేశారని..?



ఇదా అభివృద్ధి : డ్రైనేజీలు మూసివేయడంతో ఆర్ట్స్ కళాశాల గేటు ఎదుట నుంచి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

- ఎంపీ అని మరిచారా?
- అభివృద్ధి అంటే ఇదేనా!?
- ఏడు నియోజకవర్గాల మాటేంటి
- అభివృద్ధి పేరుతో నగరం అతలాకుతలం
- డ్రైన్లను పూర్తిగా మూసేసిన వైనం
- రోడ్లపైకి వస్తున్న మురుగునీరు
- పనుల్లో నాణ్యత కరువు
- తిప్పలు పడుతున్న జనం
- మిగతా నియోజకవర్గాలకు మొండిచేయి
- మళ్లీ దేనికి సిద్ధమని ప్రజల ప్రశ్న

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఓ ప్రజాప్రతినిధి అవగాహనాలేమి, ఆర్భాటాల ఆరాటానికి చారిత్రాత్మక రాజమహేంద్రవరం నవ్వులపాలవుతోంది.. అధికారుల డూడూ బసవన్నల తీరు, పనితనంపై జనం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీ నిధుల మాటే లేకుండా కార్పొరేషన్ నిధులతో పనికాని చేస్తున్నారు. నాణ్యతకు తిలోదకాలు ఇచ్చేసి 'షో'కులకు నిధులు విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. కమీషన్ల కక్కుర్తికి అభివృద్ధి అనే పేరు తగిలించి ఎన్నికల వేళ చేస్తున్న అతలాకుతలానికి ఇక్కట్లు పడుతున్నారు.

7 నియోజకవర్గాలకు ఏం చేశారు..

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఎక్కడా ఎంపీ భరత్‌రామ్ ప్రజలకు అవసరమైన పనులను పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో నియోజకవర్గాల్లోని రోడ్లు, డ్రైన్లు, వీధిలైట్లు వంటి మౌలిక సదుపాయాలు అస్తవ్యస్తంగా మారాయి. శివార్ల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. జిల్లా కేంద్రమైన రాజమహేంద్ర వరంలోని కార్పొరేషన్ పరిధికి ఆనుకొని ఉన్న పంచాయతీల్లోని ఆవాసాలకు ఇప్పటికీ గోదావరి నీళ్లందడం లేదు. డ్రైన్లు లేవు. చెత్త పన్ను వసూలు చేస్తున్నా చెత్తను తీసుకెళ్లడానికి వాహనాలు రావు. ఆనంద్‌నగర్ వంటి ప్రాంతాల్లో దోమలు,ఈగలు,పందులతో రోజూ పోరాటమే. కొవ్వూరు,నిడదవోలు, అనపర్తి, రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్, గోపాలపురంలో ప్రజల సమస్యలను తీర్చే పనులు ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నిస్తున్నాయి. ఈ ఐదేళ్లలో ఏడు నియోజకవర్గాలకు ఒరిగిందేమిటని జనాలు ప్రశ్నిస్తున్నారు. మళ్లీ తమరు దేనికి 'సిద్ధం' అంటూ ఎద్దేవా చేస్తున్నారు. గత ఎన్నికల హామీలను ఒక్కసారి గుర్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఎందుకంటే రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంపీ ఐదేళ్లుగా చేసిందేమీలేదు.

సమస్యలు గాలికొదిలేసి...

నగరాభివృద్ధికి వందల కోట్లు తెచ్చాం.. సుందరంగా చేశాం అంటూ ప్రతిరోజూ గాలిమా టలతో ఊదరగొడుతుంటారు. ఆ ప్రగల్భాలను నగరంలో రోడ్డుపై పొంగిపొర్లుతున్న డ్రైన్లు, బిళ్లల అతికింపులో మరిచిన ఇంగితం, శివార్లలో పందులు, మురుగు కంపు వెక్కిరిస్తున్నాయి. జిల్లా కేంద్రాన్ని రూ.400 కోట్లతో(ఈ మాట అధికారులతో చెప్పించాలని మాత్రం అడగొద్దు సుమా! వాళ్ల నోటి వెంట రూ.70 కోట్లకు మించి రాకపోవచ్చు) అభివృద్ధి చేశామని సదరు ప్రజాప్రతినిధి పదేపదే అదేపనిగా చెబుతున్నారు. నగరాన్ని, పట్టణాలను పట్టిపీడిస్తున్న శాశ్వత సమస్యలకు..శివార్ల అభివృద్ధిని మాత్రం పక్కన పెట్టేశారు. మూణ్నాళ్ల ముచ్చటలో భాగంగా బాగున్న ఫుట్‌పాత్ రెయిలింగ్‌లను పీకేసి బిళ్లలు అతికించడం, లైట్లు ఉన్న చోట మళ్లీ లైట్లు వేయడం, కప్పుసాసర్లు నిర్మించడం, తూరలకు రంగులు వేసి రోడ్ల పక్కన పెట్టడం,బాలికల వసతి గృహాల నడుమ హోటళ్లు పెట్టించడం, విద్యాలయ వాతావరణాన్ని కలుషితం చేయడం వంటి మెగా ప్రాజెక్టులు చేపట్టారు. దీంతో యావ పాలకులది..తిప్పలు జనాలవి అన్నట్లుగా పరిస్థితి దాపురించింది.పైగా ఎన్నికల వేళ అభివృద్ధి పేరుతో సృష్టిస్తున్న విధ్వంసాన్ని చూస్తున్న జనం..ఇప్పటి వరకూ నిద్దరోయారా అంటూ ఓ నిట్టూర్పు విడుస్తున్నారు. మళ్లీ ఓటేస్తే ఏం చేస్తారో! అని భయాందోళనకు గురవుతున్నారు.

నిధులేం తెచ్చారని..

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఈ ఐదేళ్లలో ఎంపీగారు కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి ఏం అభి వృద్ధి పనులు చేశారనే ప్రశ్న వేస్తే సమాధానం చెప్పడం ఆయనకూ కాస్త కష్టమే.ఎంపీగా కేంద్ర ప్రభుత్వం నుంచి తెచ్చిన నిధుల ఊసు ఎప్పుడూ చెప్పరు. ఎంతసేపూ రాజమహేంద్రవరం మోరంపూడి ఫ్లైఓవర్ గురించి చెబుతూ.. ఫ్లెక్సీలను సైతం నింపేస్తున్నారు. వాస్తవానికి ఎంపీగా మురళీ మోహన్ ఉన్నప్పుడు ఇక్కడ ఫ్లైఓవర్ అవసరమని గుర్తించారు. దాంతో పాటు మరో నాలుగు ఫ్లైఓవర్లను కేంద్రం నుంచి మంజూరు చేయించారు. ఆయన హయాంలోనే శంకుస్థాపన కూడా చేశారు. తర్వాత ఎన్నికలు రావడం.. సాంకేతిక కారణా లతో ప్రాజెక్టు మొదలు కాలేదు.ఎంపీగా భరత్ రామ్ ఎన్నికైన నాలుగేళ్లకు ఆ ప్రాజెక్టు గుర్తుకొచ్చింది. భరత్ రామ్ హయాంలో మొదలు కావడంతో 'అన్నం వార్చిన వాడే వండినట్లు' అన్న చందంగా ఫ్లైఓవర్‌ని ఆయన ఖాతాలో వేసేసుకున్నారు. అది మినహా నగరానికి లేదా జిల్లాలోని మిగతా మునిసిపాలిటీలు,పంచాయతీలకు ఎంపీ స్థాయిలో చేసిన మేలు ఏమిటో ఫ్యాను గాలికే తెలియాలి. కనీసం ట్రాఫిక్ సమస్యలను తీర్చలేకపో యారు. ఎక్కడైనా అభివృద్ధి అంటే దానికి అనుగుణంగా రోడ్లు వెడల్పు చేస్తారు. కానీ వింతగా రాజమహేంద్ర వరంలో రోడ్లను కుచించేస్తున్నారు. దీంతో ఆయా కూడ ళ్లలో బస్సులు మలుపుతిరగడానికీ తిప్పలు పడాల్సి వస్తో ంది. రాజమహేంద్రవరం సిటీలోని ఈట్ స్ట్రీట్, హ్యాపీస్ట్రీట్ అంటూ నిధులు గోల్‌మాల్ చేశారనే ఆరోపణలున్నాయి.

నిండు కుండకు కన్నం..

రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వలేదు. కేంద్ర నుంచీ తీసుకొచ్చే సీన్ లేదు. జిల్లాలో రాజమ హేంద్రవరం ఒకటే మునిసిపల్ కార్పొరేషన్. మిగతావన్నీ మునిసిపాలిటీలు,పంచాయతీలు.వీటిలో పెద్దగా జనరల్ ఫండ్స్ (ప్రజలు చెల్లించే పన్నులు) ఉండవు. మిగులు నిధులూ అంతంత మాత్రమే.కానీ రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో జనరల్ ఫండ్స్ ఎప్పుడూ నిండు కుండలా ఉంటాయి. వీటిపై ఎంపీగారి కన్ను పడడంతో నిండు కుండకు పెద్ద కన్నమే పడింది. మూణ్నాళ్ల ముచ్చట పనులకు జనరల్ ఫండ్స్ ఎడాపెడా ఖర్చు చేసేస్తున్నారు. కోట్లాది రూ పాయలు జేబుల్లో పోసుకుంటున్నారు. కంబాల చెరువు పార్కు అభివృద్ధి అంటూ రూ.13 కోట్లు వెచ్చించారు. తీరాచూస్తే దోమలతో కుట్టించుకుంటూ దుర్వాస నను పీల్చడానికి టికెట్ పెట్టారు. పార్కుల అభివృద్ధి స్థానిక సంస్థల విధి. కానీ రాజమండ్రి విధి కమీషన్ల దారి పట్టడంతో కాసేపు సేదతీర దామనుకున్న ప్రజల నుంచి లక్షల రూపాయలు లాగేస్తున్నారు. చారిత్రక ఆనవాళ్లయిన సుబ్రహ్మణ్య మైదానాన్ని రూపురేఖలు లేకుండా చేసేశారు.రాజమహేంద్రవరంలోని వై.జంక్షన్ నుంచి లాలాచెరువు వరకూ గ్రాండ్ ట్రంక్ రోడ్ పేరుతో బిళ్లలు అతికించే బృహత్తర ప్రాజెక్టును చేపట్టారు. అప్పటి వరకూ ఉన్న రెయిలింగ్‌ను పీకేసి బూడిదపై బిళ్లల అతికింపునకు సుమారు రూ.7 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమం మూడేళ్ల నుంచీ సుదీర్ఘంగా కొన సాగుతూనే ఉంది. ఈ పనుల్లోనూ నాణ్యత లేదు. సెంటర్ డివైడర్‌లో పెద్ద పెద్ద లైట్లు ఉండగా ఫుట్‌పాత్‌లపై మళ్లీ లైట్లు వేసి ఆర్భాటాన్ని చాటుకుం టున్నారు. రుడా ఏర్పాటు చేసిన మొక్కల కుండీల ఉద్దేశమేమిటే వాటికే బోధపడడం లేదు. వీటి అడ్డుతో చిరువ్యాపారులు రోడ్డుపైకి వచ్చారు. దీంతో రోడ్డుపై సంచరించే ప్రదేశం కుచించుకుపోయింది. దేవీచౌక్, పుష్కరాలరేవు కూడళ్లలో రాతి యుగాన్ని మళ్లీ కళ్లముందుకు తెచ్చారు. బాగున్న సర్ఫేస్‌ని తవ్వేసి రాళ్లు అతికించారు. అవి ఇప్పుడు గుంతలమయంగా మారాయి.వర్షం వస్తే నీళ్లు నిలిచిపోతున్నాయి. ఇలాంటి అనవసర పనులకు ఖర్చు చేసిన కోట్లాది రూపాయలతో రాజమహేంద్రవరంలోని డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికేదంటూ నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అసమర్థతకు, నిబద్ధతకు అదే తేడా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.


కార్మికులకెంత కష్టం..


రోడ్లపైనే చెత్త


సిల్ట్‌తో మూసుకుపోయిన డ్రైనేజీ

ఇదీ..అభివృద్ధేనా..!

వై.జంక్షన్ నుంచి లాలాచెరువు వరకూ ఫుట్‌పాత్‌లకు రెయిలింగ్ ఉండేది.దానిని తీసేసి ఫుట్‌పాత్‌లపై బిళ్లలు అతికించే పని చేపట్టారు. అంతం కాదిది ఆరంభం అనే తీరుగా ఈ పనులు కొనసాగుతున్నాయి.అయితే ఈ పనుల్లో ఇంజనీరింగ్ అద్భుతాలను చూసి జనం విస్తుపోతున్నారు. డ్రైనుపైన ఆ చివర నుంచి ఈ చివర వరకూ పూర్తిగా మూసేశారు.పూడిక ఎప్పటికప్పుడు తొలగించ డానికి ఎక్కడా నాలుగు స్లాబు బిళ్లలు వేయలేదు. ఆర్ట్స్ కళాశాల వద్ద వ్యర్థాలు పేరుకుపోయి గత గురువారం మురుగునీరు రోడ్డుపైకి వచ్చింది. పారిశుధ్య అధికారులు చేరుకున్నా.. ఎక్కడ తొలగించాలో (పగల గొట్టాలో) తోచక ఇంజనీరింగ్ అధికారులు వచ్చే వరకూ వేచి చూడాల్సి వచ్చింది. తర్వాత పారిశుధ్య కార్మికులు పీకల్లోతు మురుగు నీళ్లలో గంటల పాటు పూడిక క్లియర్ చేసే పనిచేయాల్సి వచ్చింది. ఇంజనీరింగ్,పారిశుధ్య అధికారులకు సమన్వయం కొరవడడం..అహాలకు పోవడంతో డ్రైన్లలో ఇలాంటి పరిస్థితి వస్తుందనే ఆరోపణలున్నాయి.

నిండు జీవితానికి.. రెండు చుక్కలు

పల్స్ పోలియో కార్యక్రమంలో కలెక్టర్ మాధవీలత



రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 3 : రెండు పోలియో చుక్కలతో చిన్నారులకు ఆరోగ్యవంతమైన జీవితాన్ని అందించవచ్చని కలెక్టర్ కె మాధవీలత అన్నారు. జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరం కంబాలపేట పట్టణ ఆరోగ్యకేంద్రంలో కలెక్టర్ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి మాట్లాడారు.ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు, చుట్టుపక్కల ఉన్న చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. జిల్లాలో ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయడం జరుగుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ సామాజిక భాగస్వామ్యం కావాలని కోరారు. జిల్లాలో లెక్కల ప్రకారం 1,90,479 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాల్సి ఉందని తెలిపారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, వైద్యాధికారులు, పట్టణ ఆరోగ్యకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపురం వైసీపీలో వర్గ విభేదాలు

చిన్నాయిగూడెంలో సమావేశానికి ఒక వర్గం గైర్హాజరు

దేవరపల్లి, మార్చి 3 : గోపాలపురం నియోజకవర్గ వైసీపీలో విభేదాలు భగ్గుమంటూనే ఉన్నాయి. ఒక వర్గం నాయకులు హోం మంత్రి వనితకు దూరంగా ఉంటున్నారు. దేవరపల్లి మండలంలోని సంగాయిగూడెం, చిన్నాయిగూడెం గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఆత్మీయ సమావేశాలు జరిగాయి. చిన్నాయిగూడెంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఒక వర్గం నాయకులు దూరంగా ఉన్నారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఉన్నప్పటి నుంచి రెండు వర్గాల మధ్య అంతర్గత పోరు ఉంది. గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా హోం మంత్రి తానేటి వనితను నియమించిన తరువాత గోపాలపురం నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) ఇరు వర్గాలను కూర్చోబెట్టి సమన్వయంగా ఉండాలని సూచించారు.అయినా ఒక వర్గం నాయకులు ఆత్మీయ సమావేశాలకు దూరంగానే ఉంటున్నారు.దీంతో వర్గ విభేదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గతంలో ఉన్న విభేదాల కారణంగానే దూరంగా ఉంటున్నట్టు సమాచారం. అయితే వనిత వచ్చినా విభేదాలు మాత్రం వీడలేదు.


శిక్షణకు హాజరైన పోలీసులతో ఎస్పీ జగదీశ్

సైబర్ నేరాల అదుపునకు ప్రత్యేక శిక్షణ

రాజమహేంద్రవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై దర్యాప్తు అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎస్పీ జగదీశ్ ఆదేశించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది సైబర్ నేరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన రక్షణ కల్పించవచ్చన్నారు. ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్ కుమార్ ఆదేశాలతో ఎస్పీ జగదీశ్ ఆధ్వర్యంలో జిల్లాలోని పోలీసు సిబ్బందికి సైబర్ నేరాలపై రెండు రోజుల పాటు ప్రాథమిక శిక్షణ నిర్వహించారు. లోన్‌యాప్‌లు, సోషల్ మీడియా, ఓటీపీ తదితర అంశాలకు సంబంధించిన మోసాలు, కాల్ డేటా విశ్లేషణ, బాధితులకు సహాయపడడం, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఫోన్‌పే, గూగుల్‌పే, జీ-మెయిల్ తదితర వాటికి సంబంధించిన కేసుల్లో దర్యాప్తు వంటివి క్షుణ్ణంగా వివరించారు. ఆయా పోలీస్ స్టేషన్ల నుంచి హాజరైన 30 మంది సిబ్బందికి సీఐ జి.ఉమామహేశ్వరరావు, ఎస్ఐ ఎం.అయ్యప్పరెడ్డి, కానిస్టేబుల్స్ వైఎస్‌వీ సురేశ్, జే.రవికుమార్, అబ్దుల్ షౌకత్, కవిత, ప్రియదర్శిని సైబర్ నేరాలపై తర్ఫీదునిచ్చారు.



కోకో కేజీ రూ.500

రికార్డు ధర - రైతాంగం ఆనందం

పెరవలి, మార్చి 3 : కోకో గింజల ధర గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయికి చేరింది. ఏకంగా కేజీ రూ.500ల విక్రయిస్తున్నారు. గతేడాది రూ.240లు పలికిన ధర క్రమంగా పెరిగి 300, 350,400 నుంచి ప్రస్తు తం రూ.500లకు చేరింది. దీంతో కోకో పండించే రైతాంగం ఆనందంగా ఉన్నారు. కోకో గింజలు కొనుగోలు చేసే కంపెనీల మధ్య పోటీ ఏర్పడి ఈ విధంగా ధర పెరుగుతున్నట్టు కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. డిమాండ్ తగిన ఉత్పత్తి లేకపోవడం కూడా మరో కారణం అంటున్నారు. ఏదైమైతేనేం ధర పెరగడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరింత సాగు చేసే దిశగా ఆలోచన చేస్తున్నారు.



అమ్మా.. కోటసత్తెమ్మ

నిడదవోలు, మార్చి 3 : నిడద వోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ అమ్మవారిని ఆది వారం భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని విశేష పూజలు చేశారు.ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళ లాడింది. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చనా, లలితా పారా యణం, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి క్షీర నివేదన, మహానివేదన చేశారు.భక్తులు అమ్మవారిని పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దర్శనం కలగజేశారు. ఆదివారం అమ్మవారికి మొత్తం రూ.1,28,141లు ఆదాయం లభించినట్టు ఆలయ కార్య నిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు.

ప్రభుత్వాసుపత్రిలో ప్రైవేటు వల

ఓపీ ప్రభుత్వాసుపత్రిలో.. వైద్యం సొంత ఆసుపత్రుల్లో..




రాజమహేంద్రవరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి

- మల్టీస్పెషాల్టీ వైద్యసేవల పేరుతో తిష్ట
- అందుబాటులో ఉండని వైద్యులు
- చార్టు సమయం ఎగవేత
- అప్పుడప్పుడు వచ్చి రోగులకు వల
- సేవ ముసుగులో సా..గుతున్న దోపిడీ
- నాడు సరే.. మరిప్పుడెందుకు ?
- బోధనాసుపత్రిగా మారినా ఇంతే

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 3 : మల్టీస్పెషాలిటీ వైద్యసేవల పేరుతో ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల వైద్యులు రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో తిష్ట వేయడం ఆసుపత్రి వైద్యులు, ఉద్యోగ వర్గాల్లో తీవ్ర చర్చ రేపుతోంది. జిల్లా ఆసుపత్రి స్థాయి నుంచి బోధనాసుపత్రి, సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)గా ఎదిగినా ఆసుపత్రి అధికారులు నేటికీ ప్రైవేట్ వైద్యుల సేవలను వినియోగించుకోవడం అందరికీ విస్మయాన్ని కల్గిస్తోంది. దీంతో మల్టీస్పెషాలిటీ వైద్యసేవల మతలబు ఏమిటనేదానిపై అందరిలోనూ ఆరా మొదలవుతోంది. అసలు ఇక్కడ రోగులకు అందుతున్న సూపర్ వైద్యం ఏమిటి ? అసలు ప్రయోజనం ఉంటోందా ? కేవలం ఓపీ కోసం ప్రభుత్వాసుపత్రిలో ప్రైవేట్ వైద్యం అవసరమా అనే చర్చ జరుగుతోంది. కొందరు స్పెషలిస్టు వైద్యులు వారానికి ఒకసారి వస్తే, మరికొందరు రెండుసార్లు వస్తుంటారు. ఇలా వారానికి ఒకసారి, వారానికి రెండు సార్లు చూసే ఓపీ వల్ల ఎవరికి ప్రయోజనం కలుగుతోంది, మరెవరికి మేలు జరుగుతోంది అనే సందేహాలు జనంలో కలుగుతున్నాయి. స్పెషలిస్టు వైద్యులు ఓపీ చూసిన తర్వాత మందులు రాస్తుంటారు. ఈ మందులు ఎక్కడ కొనుక్కోవాలి. ఎక్స్‌రే, స్కానింగ్, ఎంఆర్ఐ వంటి పరీక్షలు రాస్తుంటారు. రిపోర్టులు రెండు, మూడు రోజుల వరకూ రావు. వీటిని ఎవరికి చూపించుకోవాలి అనే సందేహాలు అందరిలోనూ మెదులుతున్నాయి.

ఏ డాక్టర్ ఎప్పుడొస్తారో తెలియని దైన్యం ...

మల్టీ స్పెషాలిటీ ఓపీ వైద్యసేవలకు ఏ డాక్టర్ ఏ రోజున వస్తారో ఒక చార్టు ప్రిపేర్ చేశారు. సోమ, శుక్ర, శనివారాల్లో న్యూరాలజీ, బుధ, శుక్ర వారాలు కార్డియాలజీ, బుధ, గురు, శనివారాలు న్యూరో సర్జరీ, బుధ, గురు వారాలు గ్యాస్ట్రోఎంట్రాలజీ, గురువారం ప్లాస్టిక్ సర్జరీ, నెఫ్రాలజీ, బుధవారం యూరాలజీ, శనివారం పిడియాట్రిక్ సర్జరీ, మంగళవారం సర్జికల్ అంకాలజీ, సోమవారం రేడియేషన్ అంకాలజీ, శుక్రవారం ఎండోక్రైనాలజీ స్పెషలిస్టు డాక్టర్లు అందుబాటులో ఉంటారని బోర్డులు పెట్టారు. ఇప్పుడు ఈ చార్టు మొక్కుబడిగా మారింది. ఏ డాక్టర్ ఎప్పుడు వస్తారో తెలియని దైన్యం నెలకొంది. ప్రతిరోజూ డాక్టర్లకు ఫోన్లు చేసి వస్తున్నారో లేదో తెలుసుకునే డ్యూటీ సైక్రియాటిక్ విభాగంలో కౌన్సిలర్‌గా పనిచేసే ఒక కాంట్రాక్టు ఉద్యోగిని చూస్తుంటారు. సంబంధిత డాక్టర్ వస్తున్నారా లేదా అనేది ఉదయం పది గంటల సమయంలో తెలుసుకుని ఆసుపత్రి ఉద్యోగుల వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేయడం జరుగుతుంది. అయితే స్పెషలిస్ట్ వైద్యుల సమాచారం ముందుగా రోగులకు తెలియకపోవడంతో రోగులకు తిప్పలు తప్పడంలేదు.


... The Public are Requested to Utilise the Service
MULTI-SPECIALITY OP [02:00 PM TO 04:00 PM]
GGH RAJAMAHENDRAVARAM

S.No	Name of the Speciality	Day the Spl. Doctor Available
1	Neurology	Monday, Friday, Saturday
2	Cardiology	Wednesday, Friday
3	Neuro Surgery	Wednesday, Thursday, Saturday
4	Gastroenterology	Wednesday, Thursday
5	Plastic Surgery	Thursday
6	Nephrology	Thursday
7	Urology	Wednesday
8	Peadiatric Surgery	Saturday
9	Surgical Oncology	[illegible]

దోపిడీ సాగుతుందిలా..

మల్టీస్పెషాలిటీ పేరుతో సాగుతున్న ప్రైవేట్ వైద్యసేవలపైనా తీవ్రస్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డాక్టర్‌తో పాటు వచ్చే సహాయకులు రోగుల వివరాలు, ఫోన్ నెంబర్లు సేకరించి ఆ తర్వాత ఫాలో అప్ చేస్తుంటారనే ఫిర్యాదులున్నాయి. ప్రభుత్వాసుపత్రిలో ఓపీ చూసిన తర్వాత ఆ రోగులను మెరుగైన వైద్యం కోసం అంటూ తమ సొంత ఆసుపత్రులకు తరలించుకుపోతున్నారనే ఆరోపణలున్నాయి. మొదటి నుంచీ ఇలాంటి విమర్శలు వస్తున్నా అప్పుడు, ఇప్పుడూ ఆసుపత్రి అధికారులు దీనిపై దృష్టిసారించకపోగా కనీసం సమీక్షించిన దాఖలా కూడా లేదు.

ఏడాదిన్నరగా ప్రైవేటు సేవలు..

ఏడాదిన్నర కిందట వరకూ రాజమహేంద్రవరం జిల్లా ప్రభుత్వాసుపత్రి ఏపీ వైద్యవిధానపరిషత్ కింద ఉండేది. అప్పట్లో జిల్లా ఆసుపత్రి కొచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడానికంటూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సహకారంతో ప్రైవేట్ వైద్యుల సేవలకు అధికారులు పచ్చజెండా ఊపారు. రాజమహేంద్రవరంలోని కార్పొరేట్ ఆసుపత్రుల నుంచి రోజుకు ఒక స్పెషలిస్టు వైద్యుడు జిల్లా ఆసుపత్రికి వచ్చి ఓపీ చూసేవారు. కేవలం ఓపీ చూసి వైద్యపరీక్షలు చేసి మందులు రాయడానికి మల్టీస్పెషాలిటీ వైద్యులను తీసుకొచ్చినా ఆ తర్వాత ఇక్కడ జరిగే తతంగం మరోలా మారింది. ఆ తర్వాత జిల్లా ఆసుపత్రిని బోధనాసుపత్రిగా మార్చుతూ డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ 2022, మే 16న జీవో జారీ చేశారు. ఆసుపత్రి స్థాయి పెరగడంతో పలు విభాగాలకు హెచ్‌వోడీలు, నర్సింగ్ స్టాఫ్, ఇతర పారా మెడికల్ సిబ్బంది వచ్చారు. ఇటీవలే నలుగురు స్పెషలిస్టు వైద్యులను డీఎంఈ నుంచి నియమించారు. క్యాన్సర్‌కు సంబంధించిన సర్జికల్ అంకాలజీ, రేడియేషన్ అంకాలజీ, న్యూరో ఫిజీషియన్, న్యూరో సర్జన్లు విధుల్లో చేరారు. మరికొందరు రావాల్సి ఉంది. స్పెషలిస్టు వైద్యులు పూర్తిస్థాయిలో లేరనే సాకుతో ప్రైవేట్ ఓపీ సేవలను కొనసాగించడం కార్పొరేట్ ఆసుపత్రులకు మేలు చేయడమేననే అభిప్రాయం సామాన్య జనాల్లో వ్యక్తమవుతోంది.

కెమెరాల కోసం యువకుడి హత్య

- విశాఖలో అదృశ్యమై.. జొన్నాడలో శవమయ్యాడు
- బక్కన్నపాలెం ఫొటోగ్రాఫర్ సాయి మృతదేహం లభ్యం
- గోదావరి ఇసుక తిన్నెల్లో వెలికితీత
- నిందితుడు మూలస్థానం వాసి


హత్యకు గురైన పోతిన సాయి (పాత చిత్రం)


ఆలమూరు: జొన్నాడ సమీపాన గోదావరిలో పాతిపెట్టిన మృతదేహాన్ని వెలికితీసిన దృశ్యం

కొమ్మాది/ఆలమూరు, మార్చి 3 : మధురవాడలోని బక్కన్నపాలెంకు చెందిన ఫొటోగ్రాఫర్ సాయి పవన్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం వద్ద హత్యకు గురవ్వడం స్థానికంగా సంచలనం రేపింది. పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. బక్కన్నపాలెం గ్రామానికి చెందిన పోతిన సాయి పవన్ ఆన్‌లైన్ బిజినెస్ ద్వారా ఫొటో షూట్‌లు చేస్తుంటాడు. తండ్రి శ్రీను ఆటోడ్రైవర్ కాగా తల్లి రమణమ్మ కార్‌షెడ్ జంక్షన్‌లో ఫ్యాన్సీషాపు నిర్వహిస్తున్నారు. వారికి ఇద్దరు కుమారులు కాగా పెద్దవాడు సాయి పవన్ (22) ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా ఫొటోషూట్ చేస్తుంటాడు. ఈ విషయం తెలుసుకున్న కోనసీమ జిల్లా ఆలమూరు మండలం మూలస్థానం అగ్రహారానికి చెందిన షణ్ముఖ తేజ తాను కూడా ఫొటో షూట్ చేస్తుంటానని, ఫోన్ ద్వారా సాయిని పరిచయం చేసుకున్నాడు. షణ్ముఖ తేజ, సాయి వద్ద రూ. 15 లక్షల విలువైన హైటెక్నాలజీ కెమెరాలు ఉన్నట్టు తెలుసుకున్నాడు.వాటిని ఎలాగైనా దక్కించుకోవాలన్న ఉద్దేశంతో సాయికి ఫోన్ చేసి రావులపాలెంలో పెద్ద ఈవెంట్ ఉందని, నీ దగ్గర ఉన్న కెమెరాలతో ఇద్దరం కలిసి ఈవెంట్ చేస్తే మంచి డబ్బులు వస్తాయని నమ్మ బలికాడు. దీంతో సాయి గతనెల 26న విశాఖ నుంచి రైలులో బయల్దేరి రాజమహేంద్రవరం చేరుకున్నాడు. అక్కడి నుంచి షణ్ముఖ తేజ కారును అద్దెకు తీసుకొచ్చి కడియం మండలం పొట్టిలంకకు చెందిన కారు డ్రైవర్ వినోద్‌తో కలిసి దారిమధ్యలో సాయి పీకను తాడుతో బిగించి హత్య చేసి జొన్నాడ వద్ద గోదావరి ఇసుక తిన్నెల్లో పాతి పెట్టారు. రూ.15 లక్షల విలువ చేసే కెమెరాలు, ఇతర సామగ్రిని పట్టుకుని పారిపోయారు. అయితే ముందుగా తనకు ఏదో ఆపద జరుగుతుందని గమనించిన సాయి కారు నెంబరును తన తల్లికి వాట్సాప్ చేశారు. తన నెంబరు పని చేయకపోతే వేరే నెంబరుకు ఫోన్ చేయమని తేజ నెంబరు పంపించాడు. తన కుమారుడు ఆపదలో ఉన్నాడనే విషయాన్ని తల్లి తెలుసుకోలేక పోయింది. ప్రతిరోజూ మాట్లాడేవాడు రెండు రోజులుగా ఫోను చేయలేదని అనుమానం వచ్చి వారి వద్ద ఉన్న సమాచారంతో గతనెల 29న పీఎం పాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదృశ్య కేసుగా నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సాయి పంపించిన కారు నంబరు, ఫోన్ నంబరు ఆధారంగా నిందితుడు మూలస్థానానికి చెందిన షణ్ముఖ తేజగా గుర్తించారు. సాయి కుంటుబ సభ్యులు పీఎం పాలెం సీఐ రామకృష్ణ సూచన మేరకు నిందితుడి ఇంటికి వెళ్లగా అప్పటికే షణ్ముఖతేజ పరారీలో ఉన్నాడు. అతని తల్లిదండ్రుల ను పోలీసులు విచారించగా సాయిని హత్య చేసి, కెమెరాలను పైనగదిలో పెట్టినట్టు చెప్పడంతో పోలీసు లు గది తాళాలు పగలకొట్టి కెమెరాలను స్వాధీనం చేసుకున్నారు. కెమెరాలను షణ్ముఖ తండ్రిని పీఎంపాలెం స్టేషన్‌కు తీసుకెళ్లారు.


నిందితుడు షణ్ముఖ తేజ

అమ్మాయితో చాటింగ్ చేయించి పట్టుకున్నారు..

నిందితుడు షణ్ముఖ తేజ మొదటి నంబరు స్విచ్చాఫ్‌లో ఉండగా రెండో నెంబరును పోలీసు లు ట్రేస్ చేసి అన్నవరంలో ఉన్నట్టు గుర్తించా రు. అక్కడికి వెళ్లేసరికి ఫోన్ స్విచ్చాఫ్ చేసి తప్పించుకున్నాడు. ఈ క్రమంలో పోలీసులు శనివారం షణ్ముఖ తేజకు నగరంలోని కంచరపాలెంకు చెందిన అమ్మాయికి ఫేస్‌బుక్ ద్వారా పరిచయం ఉన్నట్టు గుర్తించి ఆ అమ్మాయిని, ఆమె తల్లిని పీఎం పాలెం స్టేషన్‌కు తీసుకువచ్చి విచారించారు. ఆమెతో షణ్ముఖకు ఫోన్‌లో చాటింగ్ చేయించారు. ఈమె మెసేజ్‌కు షణ్ముఖ స్పందించడంతో పోలీసులు అతన్ని పట్టుకున్నారు. విచారణ అనంతరం షణ్ముఖ ఇచ్చిన సమాచారం మేరకు సాయిని చంపి పూడ్చిపెట్టిన ప్రదేశాన్ని పోలీ సులు గుర్తించారు. అనంతరం పవన్ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. అయితే ఈ కేసులో కేవ లం కెమెరాల కోసమే షణ్ముఖ ఇంతకు తెగించాడా లేదా మరో కోణం ఏమైనా ఉందా అన్న అనుమానాలు వ్యక్తం కావడంతో పోలీసులు ఆ దిశగా కూడా దర్యాప్తు చేస్తున్నారు.

బాధిత కుటుంబీకుల రోదన

వారం రోజుల క్రితం అదృశ్యమైన కుమారుడు సాయి మృతదేహం చూసి తల్లిదండ్రులు శ్రీను, రమణమ్మ బోరున విలపించారు. తమతో ఎంతో సరదాగా ఉండే సాయిని దారుణంగా చంపేశారంటూ స్నేహితులు ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడిని కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.

గౌతమి ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎల్‌హెచ్‌బీ బోగీలు


గౌతమి ఎక్స్‌ప్రెస్ రైలు ఎల్‌హెచ్‌బీ బోగీలు

సామర్లకోట, మార్చి 3: రైలు ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలందించేందుకు అధునాతనమైన లింకె హాఫ్‌మన్ బుచ్ బోగీలను కాకినాడ-లింగంపల్లి-కాకినాడల మధ్య రాకపోకలు సాగించే గౌతమి ఎక్స్‌ప్రెస్ రైలును ఏర్పాటుచేశారు. ఈ రైలు ఆదివారం నుంచి ప్రారంభించారు. కాకినాడ, సామర్లకోట రైల్వేస్టేషన్లకు ఈ మేరకు రైల్వే పీఆర్వో కార్యాలయం నుంచి ఆదేశాలు ఆదివారం అందాయి. ఆంధ్రజ్యోతి ఆ వివరాలను సేకరించింది. ఈ అధునాతన బోగీలను ప్రాథమికంగా కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు గత ఏడాది జూలై నెలలో ప్రారంభించారు. ఈ బోగీలు సత్ఫలితాలను ఇవ్వడంతో మరికొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కూడా ఎల్‌హెచ్‌బీ బోగీలను మార్పులు చేయడం కొనసాగించారు. అందులో భాగంగా కాకినాడ-లింగంపల్లి-కాకినాడల మధ్య రాకపోకలు సాగిస్తున్న గౌతమి ఎక్స్‌ప్రెస్ రైలుకు కూడా ఎల్‌హెచ్‌బీ బోగీలను అనుసంధానం చేశారు. ఈఅధునాతన బోగీలను జర్మనీ కొలాబ్రేషన్‌తో కపూర్తలాలో తయారుచేస్తున్నారు. ఈఅధునాతన ఎల్‌హెచ్‌బీ బోగీ లతో ప్రయాణం ఎటువంటి కుదుపులు, సౌండ్స్ లేకుండా సాఫీగా సాగుతుంది. డబుల్ సస్పెన్షన్, డిస్క్, బ్రేకింగ్ విధానంతోనూ ఈ బోగీలలో ప్రయాణం మరింత ఉల్లాసాన్ని ఇస్తుందని రైల్వే అధికారి తెలిపారు. మొత్తం 24 బోగీలలో 22 బోగీలు ఎల్‌హెచ్‌బీ బోగీలే కావడం విశేషం.

9, 10న అఖిల భారత తెలుగు సాహితీ సదస్సు


సదస్సు ఆహ్వానపత్రికలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 3: మూడు దశాబ్దాలుగా అమెరికాలో అనేక సాహిత్య కార్యక్రమాలను నిర్వహిస్తున్న వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా 30వ వార్షికోత్సవం సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో రెండురోజులపాటు ఈనెల 9, 10వ తేదీల్లో అఖిల భారత తెలుగు సదస్సు జరగనుంది. కాకినాడ దంటు కళాక్షేత్రంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగూరి చిట్టెన్‌రాజు సదస్సు ఆహ్వానపత్రికను ఆదివారం ఆవిష్కరించారు. చిట్టెన్‌రాజు మాట్లాడుతూ సాహిత్యాన్ని ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో మొట్టమొదటిసారిగా కాకినాడలో అఖిల భారత తెలుగు సాహితీ సదస్సు జరుపుతున్నట్లు తెలిపారు. భారత 13వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథిగా హాజరవుతారని పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, మండలి బుద్ధప్రసాద్ అతిథులుగా హాజరవుతారన్నారు. కార్యక్రమంలో మార్నిజానకిరామచౌదరి, కొరుప్రోలు గౌరినాయుడు, డాక్టర్ జోస్యుల కృష్ణబాబు, వైఎస్ఎన్ మూర్తి, డాక్టర్ శైలజ, సుచిత్రామూర్తి, ప్రకాష్, చింతపల్లి సుబ్బారావు, సాయిసత్యనారాయణ, ప్రభుదాస్, కృష్ణారావు పాల్గొన్నారు.

చిన్నారిపై వేధింపులకు పాల్పడుతున్న

అధికార పార్టీకి చెందిన ఎంపీపీ కారు డ్రైవర్

- న్యాయంకోసం రోడ్డెక్కిన బాలిక కుటుంబసభ్యులు
- ఎంపీపీపై దాడికి యత్నించిన మహిళలు
- పరారీలో డ్రైవర్
- కేశవరంలో ఘటన
- పోలీసులు ఇరుపక్షాలకు నచ్చచెప్పి శాంతింప చేశారు


కేశవరంలో చిన్నారిపై ఎంపీపీ డ్రైవర్ వేధింపులను నిరసిస్తూ బాధితుడిని శిక్షించాలని కోరుతూ ఆందోళనకు దిగిన చిన్నారి బంధువులు


ఎంపీపీ వాసుపై కేశవరంలో దాడికి పాల్పడుతున్న దృశ్యం

మండపేట, మార్చి 3: నాల్గవ తరగతి చదువుతున్న చిన్నారిపై వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై ఎంపీపీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవటంతో న్యాయం కోసం రోడ్డెక్కిన బాలిక కుటుంబ సభ్యులతో కేశవరంలో ఆదివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. న్యాయం చేస్తామని చెప్పిన ఎంపీపీ వాసు తన వద్ద పనిచేసే కారు డ్రైవర్ బాలికను వేధిస్తుండటంతో న్యాయం చేయటంలో జాప్యం చేసి డ్రైవర్‌కు వంతపాడటంతో ఆగ్రహించిన బాలిక తల్లిదండ్రులు ఆదివారం సాయంత్రం కేశవరంలో న్యాయం కోసం రోడ్డెక్కారు. గ్రామానికి చెందిన చిన్నారి స్థానిక పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. చిన్నారిని ఎంపీపీ డ్రైవర్ పాఠశాలకు వెళ్లే సమయంలో, వచ్చేటప్పుడు వెంటపడి వేధించటం చేసేవాడు. ఈ విషయాన్ని చిన్నారి తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో తల్లిదండ్రులు నిఘా పెట్టారు. వెంటపడుతున్నట్టు తల్లిదండ్రులకు చెబితే చిన్నారిని హతమారుస్తానని బెదిరింపులకు పాల్పడినట్టు కూడా చిన్నారి చెప్పింది. తమ బిడ్డపై గ్రామానికి చెందిన ఎంపీపీ డ్రైవర్ కూసు ప్రసాద్ వేధింపులకు పాల్పడుతున్నాడని సీసీ పుటేజీలు ఆధారంగా నిర్ధారించుకున్నారు. జరిగిన సంఘటనపై ఎంపీపీకి న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. ఎంపీపీ కాలయాపన చేసి న్యాయం చేయకపోగా డ్రైవర్‌కి అండగా నిలవటంతో చిన్నారి తల్లిదండ్రులు న్యాయం చేయాలని కోరుతూ ఆదివారం సాయంత్రం కేశవరం - రాజమహేంద్రవరం వెళ్లే రోడ్డులో ఆందోళనకు దిగారు. ఒక దశలో బాలిక కుటుంబసభ్యులు ఎంపీపీ వాసుపై దాడికి ప్రయత్నించగా స్థానికులు అతడిని వేరేచోటకు తర లించారు. ఇరువర్గాల మధ్య చోటుచేసుకున్న ఉద్రిక్తత పరిస్థితులు నడుమ కేశవరం రాజహేంద్రవరం రోడ్డులో ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. కేశవరంలో జరిగిన సంఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు చెప్పటంతో చిన్నారి తల్లిదండ్రులు ఎంపీపీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండపేట రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలవారిని చెదర గొట్టారు. ఎంపీపీని ఘటనా ప్రాంతం నుంచి సురక్షిత ప్రాంతానికి పోలీసులు తరలించారు. ఈ సంఘటనపై చోటుచేసుకున్న పరిణామాలపై పోలీసులు ఇరుపక్షాలకు నచ్చచెప్పి గొడవను సర్దుమణి గేలా చేశారు. ఎంపీపీ డ్రైవర్ జరిగిన సంఘటనపై చిన్నారి కుటుంబ సభ్యులకు క్షమాపణ చెప్పటంతో ఆందోళన విరమించారు. మండపేట రూరల్ ఎస్ఐ చైతన్యకుమార్ తన సిబ్బందితో పరిస్థితిని అదుపు చేసి ట్రాఫిక్‌ను నియంత్రించారు.

డొంకరాయి పవర్ కెనాల్ మరమ్మతులు 80 శాతం పూర్తి


పనులు నిర్వహిస్తున్న కార్మికులు

మోతుగూడెం, ఫిబ్రవరి 3: చింతూరు మండలం మోతుగూ డెం డొంకరాయి మరమ్మతులు 80శాతం పూర్తయ్యాయని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా విలేఖరులతో మాట్లాడుతూ పవర్ కెనాల్ రెండు రీచ్‌ల్లో కూడా పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. మరో ఒక రోజులో మిగతా 20 శాతం పనులు కూడా పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. గ్రిడ్ అధికారులు ఈనెల 5వ తేదీ వరకే ఎల్‌సీ అనుమతులు మంజూరు చేశారని, అయితే ఈనెల 4వ తేదీన పూర్తి చేయించాలని సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్ ఆదేశించడంతో కాంప్లెక్స్ పరిధిలోని ఇంజనీర్స్ సిబ్బంది దగ్గరుండి పనులు పర్యవేక్షిస్తూ పనుల్లో నాణ్యత లోపాలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. గత రెండు రోజులు నుంచి ప్లాస్టింగ్ కాంక్రీట్ పనులు సుమారు 20 మంది కాంట్రాక్టర్లు 400 మంది కార్మికులు చేస్తున్నారు. ఆదివారం కానీ, సోమవారం కానీ ఉభయగోదావరిజిల్లాల రబీ సీజన్ నీళ్ల వదులుతున్న నేపథ్యంలో ఏపీ జెన్కో అధికారులు పనులు వేగంగా చేస్తున్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.వెంకటేశ్వరరావు, ప్లాంట్ మేనేజర్ భీమవరం బాలకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం


సీతారాములవారికి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

వరరామచంద్రపురం, మార్చి 3: రెండో భద్రాద్రిగా పేరుగాంచిన శ్రీరామగిరిలో సీతారాములవారి కల్యాణం ఆదివారం ఘనంగా జరిగింది. భద్రాచలం దేవాలయం వారి ఆధ్వర్యంలో హిందూ ప్రచారంలో భాగంగా శ్రీరామగిరిలో రామాలయ ప్రచార వాహనంలో ఈ కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అక్షింతలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి స్థానిక శ్రీరామగిరి ప్రధానార్చకుడు సౌమిత్రి పురుషోత్తమాచార్యులు, ఈవో గన్ని లక్ష్మీకుమారి, మేనేజర్ సాయిబాబు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వేశ్వరస్వామి కల్యాణం


శ్రీ విశ్వేశ్వర గిరి పీఠాధిపతి శ్రీ ఆత్మానంద భారతి స్వామి వారితో జ్యోతుల నెహ్రూ

జగ్గంపేటరూరల్, మార్చి 3: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాకలో జరుగుతున్న కోటి పార్థివలింగ మహారుద్రాభిషేకంలో భాగంగా ఆదివారం 7వ రోజు విఘ్నేశ్వర పూజ, పరిషత్ పంచగవ్య ప్రాసన, గోపూజ, మహాన్యాసము, రుద్రాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, అరుణ హోమం, వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జ్యోతుల నెహ్రూ మణి, జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి, తోట సర్వారాయులు సునీత దంపతులు పీటలపై కూర్చుని విశ్వేశ్వర స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ విశ్వేశ్వర గిరి పీఠాధిపతి, విశ్వ ధర్మపరిరక్షణ వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఆత్మానంద భారతి స్వామీజీ హాజరై మహారుద్రాభిషేకంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆత్మానంద భారతి స్వామీజీ మాట్లాడుతూ కోటి పార్థివ లింగా మహా రుద్రాభిషేకం జ్యోతుల నెహ్రూ పూర్వజన్మ సుకృతం వల్లే ఇంతటి కార్యక్రమాన్ని చేస్తున్నార న్నారు. ప్రతిఒక్కరు శివనామ స్మరణ, విష్ణు నామస్మరణ తో సనాతన ధర్మాన్ని పాటించాలని స్వామిజీ కోరారు.

నా బాల్యం గుర్తొచ్చింది..

- షిర్డీసాయి క్రీడోత్సవ్‌లో నటుడు సాయికుమార్



క్రీడోత్సవ్ కార్యక్రమంలో పాల్గొన్న నటుడు సాయికుమార్, భారతషూటర్ ఈషాసింగ్, నౌకాదళ కమేండర్ స్వాతి

రాజమహేంద్రవరం రూరల్/దివాన్‌చెరువు, మార్చి 3: రాజమహేంద్రవరం షిర్డీసాయి విద్యాసంస్థల ఆధ్వర్యంలో క్రీడోత్సవ్ పేరుతో నిర్వహించిన వార్షిక క్రీడా, సాంస్కృతిక కార్యక్రమం దివాన్‌చెరువు షిర్డీసాయి విద్యాప్రాంగణంలో ఘనంగా జరిగింది. దీనికి భారత షూటర్ ఈషాసింగ్, నౌకాదళ లెఫ్టినెంట్ కమాండర్ పి.స్వాతి, నటుడు సాయికుమార్ ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. షిర్డీసాయి విద్యానికేతన్ వ్యవస్థాపకుడు తంబాబత్తుల పాలేశ్వరరావు సతీమణి నాగమణి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈషాసింగ్ మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయస్థాయిలో రాణించాలంటే కృషి, పట్టుదల అవసరమన్నారు. సాయికుమార్ మాట్లాడుతూ మార్చ్‌ఫాస్ట్ డ్రిల్ చూస్తున్నపుడు తన బాల్యం గుర్తుకు వచ్చిందని, తాను కూడా ఎన్‌సీసీ విద్యార్థినే అన్నారు. స్వాతి మాట్లాడుతూ పిల్లల అభివృద్ధిలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపాత్ర కీలకమన్నారు. తన స్వీయ అనుభవాలను వివరించారు. విద్యార్థుల ప్రదర్శనలు, సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో షిర్డీసాయి విద్యాసంస్థల ఛైర్మన్ తంబాబత్తుల శ్రీధర్, డైరెక్టర్ టి.శ్రీవిద్య, టి.శ్రీలేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైభవంగా మాఘమాస తిరునాళ్లు

- ఆలయానికి పోటెత్తిన వేలాది భక్తులు


విశేషాలంకరణలో దర్శనమిచ్చిన శ్రీ రాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి

సర్పవరం జంక్షన్, మార్చి 3: దేశంలో ఉన్న 108 వైష్ణవ దేవాలయాల్లో ఒకటిగా ఖ్యాతి గడించిన సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం సర్పవరంలో శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణస్వామి ఆలయంలో మాఘమాస మహోత్సవాలు గత నాలుగు ఆదివారాలుగా అత్యంత వైభవంగా సాగుతున్నాయి. శ్రీభావనారాయణస్వామిని దర్శించుకునేందుకు ఉమ్మడి జిల్లా నుంచే కాక రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలిరావడంతో ఆలయానికి భక్తులు పోటెత్తారు. ముందుగా స్వామివారికి పూజారులు సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం భక్తులకు స్వామిని దర్శించుకునేందుకు అనుమతించారు. భావనారాయణస్వామిని దర్శించుకున్న అనంతరం ఈశాన్యభాగాన ఉన్న లక్ష్మీదేవి, ఆగ్నేయం లోని ఆదిశేష శ్రీభావనారాయణస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం స్వామివారికి ప్రీతిపాత్రమైన పాల పొంగులను ఆవుపిడకల పొయ్యిపై పరమాణ్ణం తయారుచేసి భక్తశ్రద్ధలతో స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. మాఘమాసంలో భావనారాయణస్వామిని దర్శించుకుంటే దేశంలో ఉన్న 108 వైష్ణవ దేవాలయాల్లో ఉన్న శైవక్షేత్రాలను దర్శించుకున్న ఫలితం దక్కుతుందని భక్తులు తెలిపారు. సుమారు 35 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ ఛైర్మన్ పుల్ల నారాయణరావు, ఈవో జె భీమశంకరరావు తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్, ఉప సర్పంచ్‌లు శీలం నాగేశ్వరరావు, పుల ప్రభాకరరావు, పుల్లచందూ, పుల్ల చక్రధర్, పి.వీరవెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా సత్తెమ్మతల్లి తీర్థం



ముమ్మిడివరం, మార్చి 3: ప్రజల ఆరాధ్య దేవత, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లి శ్రీసత్తెమ్మతల్లి అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవం ఆదివారం వైభవం గా సాగింది. గత నెల 23న ప్రారంభమైన అమ్మవారి జాతర మహోత్సవాలు ఆదివారం నాటి తీర్థంతో ముగిశాయి. తొమ్మిది రోజులపాటు జాతర మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. కోనసీమజిల్లా నుంచే కాకుండా ఉభయగోదావరి జిల్లాల నుంచి కూడా వేలాది మంది భక్తులు అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలను తిలకించి తరలివచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. మేకల వంశీయులు అమ్మవారికి స్వయంపాకం సమర్పించి జాతర మహోత్సవాలు ప్రారంభించారు. అమ్మవారిని ఆలయ ప్రాంగణం నుంచి డప్పు వాయిద్యాలు, సన్నాయి మేళాలు, భాజాభజంత్రీలు, గగుర్పాటుకు గురిచేసే శక్తివేషాలు, నాగిని డ్యాన్సులు, కేరళ వాయిద్యాలు, తీన్‌మార్ వాయిద్యాలు, కోయ నృత్యాలు, బుట్టబొమ్మల వేషధారణలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో మిరుమిట్లు గొలిపే బాణాసంచా కాల్పుల నడుమ అమ్మవారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో జరిగే తీర్థ మహోత్సవాల్లో పాల్గొన్న భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. సుమారు 30వేల మంది భక్తులకు అన్నసమారాధనలో అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించారు. సత్యసాయి సేవాసమితి సభ్యులు 150 మంది అన్నసమారాధనలో పాల్గొని సేవలు అందించారు. పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ముమ్మిడివరం సీఐ ఎస్.కొండయ్య ఆధ్వర్యంలో ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం ఎస్ఐలు డి.సురేష్‌బాబు, నాగేశ్వరరావు, భానుప్రసాద్‌ల తో వంద మంది పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహించారు.


సత్తెమ్మతల్లిని దర్శించుకుందుకు తరలి వస్తున్న భక్తులు


ఆకర్షిస్తున్న శక్తివేషాలు

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

మెరుగైన వైద్యసేవలు అందించాలి: కలెక్టర్


ఏరియా ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టరు విజయ సునీత

రంపచోడవరం, మార్చి 3: ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరు ఎం.విజయసునీత వైద్యాధికారులను ఆదేశించారు. ఆదివారం స్థానిక ఏరియా ఆసుపత్రిని ఆమె ఆకస్మికంగా పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టరు ఆసుపత్రి వార్డులను పరిశీలించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. అ వుట్, ఇన్ పేషెంట్ల తీవ్రతపై ఆరా తీశారు. రోగులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలన్నారు. ఆసుపత్రిలో ముందులు కొరత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (బాలురు) పాఠశాలను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని, తాజా ఆహార పదార్థాలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు.

నిండు జీతానికి రెండు చుక్కలు

● పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం


చుక్కలమందు వేస్తున్న డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో

ఎటపాక, ఫిబ్రవరి 3 : నిండు జీవి తానికి చుక్కల మందు విధిగా వేయించాలని డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో డా.పుల్లయ్య అన్నారు. ఆది వారం పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా నెల్లిపాక పీహెచ్‌సీలో ఆయన చిన్నారులకు పల్స్‌పోలియో చుక్కలవేసి ప్రారంభించారు. మండలంలోని గౌరిదేవిపేట పీహెచ్‌సీ పరిధిలో మొత్తం 1959 మంది చిన్నారులకు గాను1929 మంది చిన్నారులకు చుక్కలు మందు వేశారు. ఈ పీహెచ్‌సీ పరిధిలో 55 బూత్ లను ఏర్పాటు చేశారు. లక్ష్మీపురం పీహెచ్‌సీ పరిధిలో 814 మంది చిన్నారులకు 807మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. నెల్లిపాక పీహెచ్‌సీ పరిధిలో 1580 మంది చిన్నారులకు పల్స్ పోలియో వేశారు.ఈ ప్రాంతంలో 50 బూత్‌లను ఏర్పాటు చేశారు.



మోతుగూడెం: చింతూరు మండలం మోతుగూడెంలో ప్రాథమిక ఆసుపత్రి వైద్యాధికారిణి ప్రజ్ఞ పర్యవేక్షణలో మోతుగూడెంలో పోలియో చుక్కలు మార్కెట్ సెంటర్లో అంగన్‌వాడీ సిబ్బంది మాధవి, ఆశావర్కర్, పైడితల్లి చిన్నారులకు చుక్కలు వేశారు. 0.5 పిల్లలకు తప్పకుండా చుక్కలు వేయించడానికి తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. మోతుగూడెంలో ఏపీ జెన్కో హాస్పటల్‌లో, ఎస్టీ కాలనీ పోలియోచుక్కలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.

వై.రామవరం: మండలంలో ఆదివారం పలుచోట్ల పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారు. స్థానిక రామాలయం వద్ద సర్పంచ్ పల్లాల బాలురెడ్డి ఈకార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలో 95శాతం పల్స్‌పోలియో పూర్తయినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు మంచినీళ్ల నారాయణరావు, ఏఎన్ఎం భవానీ, అంగన్‌వాడీ టీచర్ బేబిరాణి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నాగదేవత విగ్రహాల ప్రతిష్ఠాపన

వై.రామవరం, మార్చి 3: వై.రామవరం గ్రామంలో నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న నాగదేవత అమ్మవారి ఆలయంలో గుడి ప్రారంభోత్సవంతో పాటు గణపతివల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి నాగదేవత విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల సమక్షంలో శాస్త్రోక్తంగా ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పూర్తిచేశారు. జంపా జగ్గయ్య చల్లయ్యమ్మ, జంపా చిన్నయ్య, పుణ్యవతి దంపతులు కుటుంబసభ్యుల సహకారంతో ఆలయాన్ని నిర్మించారని కులదేవత నాగమ్మ అమ్మ వారికి ప్రతినిత్యం పూజలు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఐటీడీఏ ధర్నాకు ఆదివాసీలు తరలిరావాలి

రంపచోడవరం, మార్చి 3: ఐటీడీఏ కార్యాలయం ఎదుట సోమవారం నిర్వహించే ధర్నాకు ఆదివాసీలు తరలిరావాలని ఆదివాసీ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బోండ్ల వరప్రసాదరావు పిలుపునిచ్చారు. జీవో నెం.3 పునరుద్ధరణ కోసం ప్రతి ఆదివాసీ నడుంబిగించి ముందుకు సాగాలన్నారు. ధర్నాకు ఆదివాసీ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జేఏసీ, అఖిల పక్ష నేతల ఆధ్వర్యంలో జరగనున్నట్లు తెలిపారు.

బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారంటీ ప్రచారం


బాబు ష్యూరిటీ పథకాలపై ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

దేవీపట్నం, మార్చి3: రంపచోడవరం టీడీపీ ఇన్‌చార్జి వంతల రాజేశ్వరి ఆదేశాల మేరకు ఆదివారం మంటూరు పంచాయతీ మడిపల్లికాలనీలో బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారంటీ, సూపర్‌సిక్స్ పథకాలపై టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల పార్టీ ఉపాధ్యక్షుడు మచ్చు త్రిమూర్తులు, క్లస్టర్ ఇన్‌చార్జి మాగాపు బాబు అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాతాళ పండు, కర్రి రాజీవ్, కురసం వెంకన్నదొర పాల్గొన్నారు.

పాపికొండలకు వెళ్లిన నాలుగు బోట్లు


పాపికొండలకు పయనమైన బోటు

దేవీపట్నం, మార్చి3: పాపికొండలకు ఆదివారం నాలుగు బోట్లలో 280మంది పర్యాటకులు వెళ్లారు. మండల పరిధిలో పోశమ్మగండి బోటు పాయింట్ జిల్లా నలుమూలల నుంచి పాపికొండలు అందాలు తిలకించేందుకు ప్రకృతి ప్రేమికులు గోదావరి పరీవాహక ప్రాంతాలైన దేవీపట్నం, పూడిపల్లి, మంటూరు, కొండమొదలు, కచ్చులూరు తదితర గ్రామాల మీదుగా పాపికొండలు వెళ్లారు.

ఘనంగా అడవిరాజులు బాబు పండుగ

వై.రామవరం, మార్చి 3: మండలంలో ఆదివారం పలు గ్రామాల్లో అడవిరాజులుబాబు పండుగను ఘనంగా జరుపుకున్నారు. వై.రామవరంలో సర్పంచ్ పల్లాల బాలురెడ్డి, మాజీ ఎంపీపీ గొర్లె శ్రీకాంత్ ఇంకా పలువురు వారివారి వ్యవసాయక్షేత్రాల్లో పండుగలు జరుపుకున్నారు. రాజులబాబు పండుగకు ఆఖరి ఆదివారం కావడంతో అధికసంఖ్యలో భక్తులు మాంసపు వంటకాలతో సహపంక్తి భోజనాల్లో పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అనంతబాబు వాహనయాత్ర

కూనవరం, మార్చి3: ఎమ్మెల్సీ అనంతబాబు కూనవరం మండలంలో వాహన యాత్ర నిర్వహించారు. ఆపార్టీ కార్యకర్తలతో ఈ యాత్ర నిర్వహించారు. కూనవరం నుంచి భీమవరం, మర్రిగూడెం, నరసింగపేట, కాచవరం, పోచవరం గ్రామాలు మీదుగా యాత్ర కొనసాగింది. ఈసందర్భంగా ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి, మరియదాసు, జడ్పీటీసీ విజయ, ఎంపీపీ రంగమ్మ, పార్టీ మండలాధ్యక్షులు ఆళ్లూరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సిరిగిందలపాడులో వైద్యశిబిరం

రంపచోడవరం, మార్చి 3: రాజమహేంద్రవరం రామకృష్ణమిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం సిరిగిందల పాడులో వైద్యశిబిరం నిర్వహించినట్లు రామకృష్ణమిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ తెలిపారు. వైద్యులు తలారి వెంకట సుబ్బారావు, దాసరి ఉమా మహేష్, రాయుడు శ్రీనివాస్, ఎస్.సంపత్‌కుమార్‌లు సుమారు 150మందికి వైద్యసేవలు అందించారు. అనంతరం వృద్ధులు, పేదలకు చీరలు పంపిణీ చేశారు. క్యాంపు కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్,వలంటీర్లు గాధిరాజు, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్..తాటాకిల్లు దగ్ధం

వై.రామవరం, మార్చి 3: మండలంలోని అన్నంపాలెంలో కురసం రాజారావు అనే గిరిజనుడి తాటాకిల్లు దగ్ధమైంది. శనివారం అర్ధరాత్రి నిద్రిస్తున్న సమయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం జరిగినట్లు చెబుతున్నారు. రూ.20 వేలు నగదు, ధాన్యం బస్తాలు, ఇంటిపట్టాలు కాలిబూడిదై బాధితులు కట్టుబట్టలతో నిరాశ్రయులయ్యారు. సుమారు రూ.లక్ష ఆస్తినష్టం ఉంటుందని అంచనా.

పోలియో చుక్కలు తప్పనిసరి

» ఐదేళ్లలోపు పిల్లలకు నూరుశాతం పల్స్‌పోలియో జరపాలి

» డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు


దివాన్‌చెరువులో చిన్నారికి పోలియోచుక్కలు వేస్తున్న డీఎంహెచ్‌వో

దివాన్‌చెరువు, మార్చి 3: ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియోచుక్కలు తప్పక వేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని పలుచోట్ల ఆదివారం నిర్వహించారు. పాలచర్ల పీహెచ్‌సీ పరిధిలోని దివాన్‌చెరువు, పాలచర్లలో జరిగిన పల్స్ పోలియో కార్యక్రమాన్ని డీఎంఅండ్‌హెచ్‌వో సందర్శించి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు చిన్నారులందరికీ నూరుశాతం పోలియో చుక్కలు వేయాలన్నారు. సిబ్బందిని ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి సోమ, మంగళవారాల్లో ఇంటింటా తిరిగి సర్వే జరపాలన్నారు. ఆసర్వేలో గుర్తించిన చుక్కలు వేయించుకోని వారికి వేయాలని డాక్టర్ బెనడిక్ట్‌కు సూచించారు. పీహెచ్‌సీ పరిధిలో 3435 మంది పిల్లలకు గాను 3210 మందికి ఆదివారం పోలియోచుక్కలు వేయడం ద్వారా 90 శాతం లక్ష్యం సాధించామని బెనడిక్ట్ తెలిపారు. మిగిలిన వారికి 3,4 తేదీల్లో ఇంటింటా తిరిగి వేయనున్నట్టు చెప్పారు. వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు సేవలందించారు. దివాన్‌చెరువు పంచాయతీ రఘునాథపురంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో చిన్నారులకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేసి పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. బస్సు, రైల్వేస్టేషన్లలో ప్రత్యేక బృందాలతో పోలియో చుక్కలు వేయిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

కడియంలో 97.58 శాతం

కడియం: మండలంలో ఐదేళ్లలోపు చిన్నారులు 5,582 ఉండగా 5,447 మందికి(97.58 శాతం) పోలియో చుక్కలు వేసినట్టు డాక్టర్లు ఎస్.జెస్సీ సుప్రియ, ఎం.మణిజ్యోత్స్న, జి.స్వరూప, ఎస్.నాగసాయిమౌర్య తెలిపారు. నాలుగు రూట్లుగా విభజించి, 36 బూత్‌లు, ఒక ట్రాన్సిట్ టీంతోపాటు ఒక మొబైల్ టీమ్‌ను ఏర్పాటు చేసి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారులు ఎం రామకృష్ణ, ఎండీ ఆలీబేగ్, హెల్త్ సూపర్‌వైజర్లు కృష్ణకుమారి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు. సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పోలియో బూత్‌లను ప్రారంభించారు.

రాజమహేంద్రవరం రూరల్‌లో 94.6శాతం

రాజమహేంద్రవరం రూరల్: మండలంలో 51 బూత్‌ల ద్వారా 16,825 మంది చిన్నారులకు గాను 15,665 మందికి పోలియో చుక్కలు వేసినట్టు డాక్టర్లు కె.సుధాకర్, జగదీష్, ఈ.నాగదేవి తెలిపారు. దీని ద్వారా మండలంలో 94.6శాతం పల్స్‌పోలియో నమోదైనట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో ఎంవీవీ సత్యనారాయణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బిక్కవోలులో 97 శాతం

బిక్కవోలు: బిక్కవోలు ఆసుపత్రి పరిధిలో ఐదేళ్ల లోపు 3317 మంది పిల్లలు ఉండగా 3212 మంది(97శాతం)కి పోలియో చుక్కలు వేశామని వైద్యాధికారిణి డాక్టర్ ఎం.దుర్గాదేవి తెలిపారు. కొంకుదురు ఆసుపత్రి పరిధిలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని జడ్పీటీసీ రొంగల పద్మావతి ప్రారంభించినట్లు వైద్యాధికారి జి.విజయలక్ష్మి తెలిపారు.

రాజానగరంలో 98 శాతం

రాజానగరం: రాజానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గుర్తించిన 5197 మందికి పిల్లలకు గాను 5102 మందికి పోలియో చుక్కలు వేసి, లక్ష్యం 98 శాతం సాధించినట్టు వైద్యాధికారి డాక్టర్ జి.రామభాస్కర్ తెలిపారు. సర్పంచ్ కుందేటి ప్రసాద్ పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు.

అనపర్తిలో 95 శాతం

అనపర్తి: అనపర్తి ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి ప్రారంభించారు. పోలియో బారిన పడిన అనేక మంది జీవితంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు తప్పక వేయించాలన్నారు. మండలంలోని రామవరం, కుతుకులూరు పీహెచ్‌సీల ఆధ్వర్యంలో అన్ని గ్రామాల్లో కేంద్రాలను ఏర్పాటు చేసి పోలియో చుక్కలు వేయడం ద్వారా లక్ష్యం 95శాతం నమోదైనట్టు వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమాల్లో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు సేవలందించారు.

గోకవరంలో 97శాతం

గోకవరం: మండలంలో ఐదేళ్లలోపు వయసున్న చిన్నారుల్లో 6218 మంది(97శాతం)కి పోలియో చుక్కలు వేసినట్టు పీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్ తెలిపారు. మిగిలిన వారికి ఈ నెల 4,5 తేదీల్లో ప్రత్యేక వైద్య బృందాలు ఇంటింటా తిరిగి పోలియో చుక్కలు వేస్తారన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 3: రెండు పోలియో చుక్కలు పిల్లల నిండు జీవితాలకు దోహదపడతాయని చైల్డ్‌రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం (సీఆర్‌పీఎఫ్) కన్వీనర్ డాక్టర్ బి.రమేష్ అన్నారు. చున్నీలాల్ మునిసిపల్ హైస్కూల్, తుమ్మలోవ పల్స్ పోలియో కేంద్రాల్లో చిన్నారులకు ఆయన పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు కుటికుప్పల అరుణజ్యోతి, దాసరి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

దివాన్‌చెరువు, మార్చి 3: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని నన్నయ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్-1 పీవో ఎస్.రాజ్యలక్ష్మి అన్నారు. దివాన్‌చెరువులో జరుగుతున్న ఎన్ఎస్ఎస్ సేవా శిబిరంలో భాగంగా మూడోరోజైన ఆదివారం మొక్కలు నాటారు. అలాగే పల్స్‌పోలియో కార్యక్రమంలో పాల్గొని సేవలందించారు. కార్యక్రమంలో గైట్ ఫార్మసీ కళాశాల కెమిస్ట్రీ విభాగాధిపతి సి.గోపి, లైబ్రేరి యన్ షేక్ మీరా, స్థానిక ఏఎన్ఎం రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి టీడీపీ-జనసేనతో సాధ్యం

» 150 స్థానాల్లో టీడీపీ-జనసేన అభ్యర్థులదే విజయం

» విశ్వబ్రాహ్మణ ఆత్మీయ సభలో టీడీపీ, జనసేన నేతలు


సభలో ప్రసంగిస్తున్న ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 3: విశ్వబ్రాహ్మణులు అభివృద్ధి, సంక్షేమం టీడీపీ-జనసేనతోనే సాధ్యమని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. రాజమహేంద్రవరం హోటల్ జగదీశ్వరీలో ఆదివారం పార్టీ తాడేపల్లిగూడెం పరిశీలకుడు నక్కా చిట్టిబాబు అధ్యక్షతన టీడీపీ-జనసేన ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తొలుత ఎన్‌టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని మాట్లాడుతూ జగన్ రాక్షస పాలనను అంతమొందించే సమయం వచ్చిందన్నారు. ఒక్క అవకాశం ప్రజలు ఇచ్చినందుకు రాష్ట్రం 20 ఏళ్ళు వెనక్కి వెళ్లిపోయిందన్నారు. ఇటువంటి తరుణంలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే చంద్రబాబును సీఎం చేయాలన్నారు. రాష్ట్రంలో టీడీపీ-జనసేన కూటమికి 150 స్థానాలు వస్తాయన్నారు. తన భర్త ఆదిరెడ్డి వాసును రాజమహేంద్రవరం ప్రజలందరు ఆశీర్వదించాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల సంక్షేమం చూసింది టీడీపీ అన్నారు. రాష్ట్రంలో ఆదరణ పథకాన్ని తీసివేసిన జగన్ నవరత్నాలు పెట్టి అందులో మీ రత్నం ఎక్కడుందో వెతుక్కోమంటున్నాడని మండిపడ్డారు. టీడీపీ-జనసేన కూటమిని అధికారంలోకి తీసుకురావాలన్నారు. ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. నగరంలో అన్ని సౌకర్యాలతో ఒక కమ్యూనిటీ హాలు నిర్మించడం, గోదావరి బండ్‌పై విశ్వబ్రహ్మ విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రాగానే తాను అనుశ్రీ సత్యనారాయణతో కలిసి విశ్వబ్రాహ్మణుల్లో 45 ఏళ్లు పైబడిన వారికి పింఛను ఇచ్చే విషయాన్ని తమ నేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌ల దృష్టికి తీసుకెళ్లి అమలు చేసేలా ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. అనుశ్రీ సత్యనారాయణ మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం టీడీపీ-జనసేన కూటమితోనే సాధ్యమన్నారు. నక్కా చిట్టిబాబు, విశ్వబ్రాహ్మణ సంఘం నూతన అధ్యక్షుడు పాలవలస వీరభద్రం విశ్వబ్రాహ్మణుల సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.అనంతరం నూతన కమిటీతో బుడ్డిగ రాధా ప్రమాణస్వీకారం చేయించారు. సమావేశంలో టీడీపీ నాయకులు యర్రా వేణుగోపాలరాయుడు, కాశి నవీన్‌కుమార్, నక్కా దేవివరప్రసాద్, కుడుపూడి సత్తిబాబు, మజ్జి రాంబాబు, కొయ్యల రమణ, మరుకుర్తి రవియాదవ్, సింహా నాగమణి, విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు లక్కోజు వీరభద్రరావు, చించినాడ తాతాజీ, వీరమళ్ళ సత్తిబాబు, అములోజు శివప్రసాద్ పాల్గొన్నారు.

వైసీపీకి మరో చాన్స్ ఇస్తే రాష్ట్రం అధోగతి

» టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి


టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలతో రామకృష్ణారెడ్డి

అనపర్తి, మార్చి 3: ఒక్క చాన్స్ పేరుతో వైసీపీ అధికారం చేపట్టి రాష్ట్రాన్ని అభివృద్ధిలో వెనక్కినెట్టిందని, మరో చాన్స్ ఇస్తే అధోగతి పాలు చేస్తుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన కుతుకులూరులో పర్యటించారు. గ్రామంలో మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని వ్యవస్థలను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. అవగాహన లేని వ్యక్తులకు అధికారం అప్పగిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ప్రజలు పూర్తిగా అర్థం చేసుకున్నారన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి గ్రామంలోని స్టీవెన్ చర్చిని సందర్శించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సూర్రెడ్డి, కర్రి చిన్నారెడ్డి, తేనెల శ్రీనివాస్, నల్లమిల్లి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక

మండలంలోని రామవరంలో బిక్కవోలు మండలం పందలపాక గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పడాల వెంకటరామారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు చాపల చిట్టిబాబు, ఉండ్రాజవరపు శ్రీను, కోడి మధుకిరణ్, వడ్లపాటి దుర్గాప్రసాద్‌లతో బాటు పదిహేను కుటుంబాల వారు టీడీపీలో చేరారు వారికి రామకృష్ణారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో అనసూరి నాగేశ్వరరావు, సబ్బెళ్ళ విజయభాస్కరరెడ్డి, పందలపాక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధికి రోల్ మోడల్ బాలయోగి

వర్ధంతిలో టీడీపీ నేతలు గోరంట్ల ,ఆదిరెడ్డి, గన్ని

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 3: బాలయోగిని లోకసభ స్పీకర్ స్థాయికి.. ప్రతిభా భారతిని శాసనసభ స్పీకర్‌ను చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. రాజమహేంద్రవరం కంబాలచెరువు పార్కులో ఉన్న దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి వర్ధంతి ఆయన ఆధ్వర్యంలో జరిగింది. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, టీడీపీ-జనసేన రాజమహేంద్రవరం ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, యర్రా వేణుగోపాలరాయుడు, కాశి నవీన్‌కుమార్, వర్రే శ్రీనివాసరావు, తలారి ఉమాదేవి, రాచపల్లి ప్రసాద్ బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.అభివృద్ధికి రోల్ మోడల్ బాలయోగి అన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: రాజమహేంద్రవరం వై.జంక్షన్‌లోని సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతిగృహం-1లో బాలయోగి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు కోరుకొండ చిరంజీవి, దారా యేసురత్నం, రైట్స్ ప్రొటెక్షన్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లూరి రాజేంద్రప్రసాద్, డీఎల్ఎస్ఏ సభ్యులు పాము బాబూరావు, వసతిగృహం అధికారులు దానవాయిబాబు, రాజేష్ పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన కూటమిని గెలిపించాలి : గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 3: టీడీపీ-జనసేన కూటమిని అధికారంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. టీడీపీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పిడింగొయ్యి పంచాయతీ శాంతిపురంలో ఆదివారం టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు మార్రి వాసుదేవ్, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి, బొప్పన నాగేశ్వరరావు, యార్లగడ్డ శేఖర్, కుంచె హనుమంతరావు, మట్టా శ్రీను, మార్ని శ్రీను, బాబుఖాన్, బొప్పన శ్రీను పాల్గొన్నారు.

పన్నుల చెల్లింపులకు ప్రత్యేక కౌంటర్లు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 3: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలోని ఆస్తి పన్నుల బకాయిదారులకు నగరంలో ప్రత్యేక కౌం టర్లు ఏర్పాటు చేశామని కమిషనర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి బకాయి పడిన ఆస్తి పన్నుల వడ్డీ మాఫీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ మేరకు వీఎల్‌పురం సచివాలయం 23, ప్రకాష్‌నగర్ సచివాలయం-14, సీతంపేట సచివాలయం-81, కోటిపల్లి బస్టాండ్ సచివాలయం-36, నారాయణపురం సచివాలయం-3, బొగ్గులదిబ్బ సచివాలయం-42లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు పన్నులు చెల్లించవచ్చునన్నారు.

ఆదర్శ ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ

కోరుకొండ, మార్చి3: మండలం కోటికేశవరం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తున్న నారెం లక్ష్మీనారాయణ ఆదర్శ ఉపాధ్యాయుడని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు రాజారావు అన్నారు. లక్ష్మీనారాయణ పదవీ విరమణ సభ ఆదివారం కోరుకొండ ఆదిత్య ఫంక్షన్ హాల్లో జరిగింది. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా బాధ్యతాయుతంగా పని చేసి ఎందరో విద్యార్థుల భవిష్యత్‌ను లక్ష్మీనారాయణ తీర్చిదిద్దారన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండలాధ్యక్షుడు మింగి శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, సాదే రాజు, కోనసీమ జిల్లా అధ్యక్షుడు టీవీఎస్ఎన్ తిలక్‌బాబు, ఉపాధ్యాయులు సాంబశివరావు, ముత్యం శ్రీనివాస్, మందపాక భాస్కర్, వీర్రాజు, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

బత్తుల బలరామకృష్ణ జన్మదిన వేడుకలు



కోరుకొండ, మార్చి 3: టీడీపీ-జనసేన రాజానగరం అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ జన్మదిన వేడుకలు ఆదివారం జనసైనికులు, వీర మహిళలు ఘనంగా నిర్వహించారు. రెండు పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని బత్తులకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణచౌదరి, జనసేన ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మితోపాటు జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

వైసీపీ ఓటమికి సమష్టిగా పనిచేద్దాం

టీడీపీ-జనసేన ఆత్మీయ సమావేశంలో బీవీఆర్ చౌదరి

రాజానగరం, మార్చి 3: రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సమష్టిగా పనిచేద్దామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణచౌదరి పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన పార్టీ శ్రేణుల ఉమ్మడి ఆత్మీయ సమావేశం రాజానగరంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా బీవీఆర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో జనసేన-టీడీపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని, అందుకు అందరూ సమైక్యంగా కృషి చేద్దామన్నారు. బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ విముక్త ఆంధ్రప్రదేశ్ కోసం, రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం జనసేన-టీడీపీ శ్రేణులు సమష్టిగా పనిచేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. రానున్న ఎన్నికల్లో రాజానగరం నియోజకవర్గాన్ని అత్యధిక మెజార్టీ సాధించి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌కు బహుమతిగా అందిద్దామని అన్నారు. అనంతరం బత్తుల, బీవీఆర్‌లను రెండు పార్టీల నాయకులు, కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాలకు చెందిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులు,కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అనారోగ్యానికి గురైన వ్యక్తికి ఆర్థిక సాయం

గోకవరం, మార్చి 3: గోకవరంలో అనారోగ్యానికి గురైన ఓ వ్యక్తికి విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ఆర్థిక సాయం చేశారు. గ్రామానికి చెందిన బాతు ఆనంద్ ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో శ్రీనివాసరావు రామసేన సభ్యులతో కలిసి ఆదివారం ఆనంద్ ఇంటికెళ్లి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

'వాహన చోరీలను అరికట్టాలి'

గోకవరం, మార్చి3: గోకవరం పరిసర ప్రాంతాల్లో వరుసగా జరుగుతున్న వాహనాల చోరీలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని మాజీ జడ్పీటీసీ సభ్యులు పాలూరి బోస్ పోలీసులకు విన్నవించారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వ్యాపారాల నిమిత్తం, ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు అప్పులు చేసి కొనుక్కుంటున్న వాహనాలను దుండగులు అపహరించడం పరిపాటిగా మారిందని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ విషయాన్ని ఎస్ఐ నాగరాజు దృష్టికి తీసుకెళ్లగా వాహనాల చోరీని అరికట్టేందుకు ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారన్నారు. గ్రామస్థులు తమ వాహనాలను భద్రపర్చుకొనే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

వచన కవితలు గ్రంథావిష్కరణ

రాజమహేంద్రవరం, మార్చి 3: అది వచనమైనా, పద్యమైనా, ప్రవచనమైనా, ఏ ప్రక్రియ అయినా సరే అందులో కవిత్వం ఉండాలని సంస్కృతాంధ్ర శతావధాని డా.పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ అన్నారు. గౌతమి గ్రంథాలయంలో ఆదివారం ఓఎన్‌జీసీ విశ్రాంత డీజీఎం కవితా ప్రసాద్ విరచిత వచన కవితలు గ్రంథావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సప్పా దుర్గాప్రసాద్, డా.అరిపిరాల నారాయణరావు, యార్లగడ్డ మోహనరావు, వీవీ సుబ్రమణ్యం, బీహెచ్ రమాదేవి, వీవీబీ.సంజీవరావు, దీక్షితుల సుబ్రహ్మణ్యం సత్కరించారు. కార్యక్రమంలో కళాగౌతమి వ్యవస్థాపకుడు బీవీఎస్ మూర్తి, కవి జోరాశర్మ, జనపాత కాశేశ్వరరావు, ప్రయాగ సుబ్రహ్మణ్యం, గోపాలాచార్యుల, అడబాల మరిడయ్య పాల్గొన్నారు.

లీలావతికి అకడమిక్ టైటాన్ ఎచీమెంట్ అవార్డు

రాజానగరం, మార్చి 3: రాజానగరం పరిధిలోని గైట్ అటానమస్ కళాశాల వైఎస్ ప్రిన్సిపాల్ ఎన్.లీలావతి అకడమిక్ టైటాన్ ఎచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. ఇంజనీరింగ్, వైద్య రంగాల్లో విశేషంగా కృషి చేస్తున్న వారికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెడికల్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ సొసైటీ(ఏఐఎంఈఈఆర్ఎస్)ఆధ్వర్యంలో మేడ్చల్ మండలం గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కండ్లకోయలలోని సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్ వేదికగా ఈ వార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యారంగంలో ఆమె సాధిస్తున్న అభివృద్ధిని ప్రస్తావిస్తూ చైతన్య సంస్థల చైర్మన్ చైతన్యరాజు, గైట్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కె.శశికిరణ్ వర్మ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.లక్ష్మీ శశివర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పీఎంఎంఎస్ శర్మ తదితరులు లీలావతిని అభినందించారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్




రాజమహేంద్రవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కాలనీలోని నాగమణి ట్యూషన్ సెంటర్‌లో ఆదివారం సైన్సుఫెయిర్ నిర్వహించారు. విద్యార్థులు చేసిన వైజ్ఞానిక ఆవిష్కరణలు ఆకర్షించాయి. గత నెల 28న జాతీయ సైన్సు దినోత్సవం విశిష్టతను విద్యార్థులు తెలుసుకునే ఉద్దేశంతో సైన్స్‌ఫెయిర్ ఏర్పాటు చేశామని ట్యూషన్ సెంటర్ నిర్వాహకుడు ఎం.వెంకటేశ్ తెలిపారు. సాధారణంగా స్కూల్స్, కాలేజీలో ఏర్పాటు చేసే వైజ్ఞానిక ప్రదర్శనను ట్యూషన్ సెంటర్‌లో నిర్వహించడం విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపిందన్నారు.

క్షమాపణ చెబితేనే రథోత్సవంలో పాల్గొంటాం

కోరుకొండ రథోత్సవం నిర్వాహకుల అల్టిమేటం

కోరుకొండ, మార్చి 3: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం సందర్భంగా చక్రాలకు చెక్కలు వేసి రథాన్ని అదుపు చేస్తున్న వంశ పారంపర్య విశ్వబ్రాహ్మణ నిర్మాహకులపై సోషల్ మీడియా వేదికగా కించపరిచే వ్యాఖ్యలు చేయడం పట్ల వారు నిరసన తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్వామి వారి దేవస్థానం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆలయ చైర్మన్ రంగరాజభట్టర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా విశ్వబ్రాహ్మణులు రథాన్ని అదుపు చేస్తున్నారని వారి మనోభావాలు దెబ్బతినే విధంగా సోషల్‌మీడియాలో వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. వారు ఏ నాడు డబ్బు డిమాండ్ చేయలేదని, వారి సేవలను దేవస్థానం గుర్తించి తమకు తోచిన తాంబూలం ఇస్తున్నామన్నారు. కొచ్చెర్ల ఈశ్వరాచార్యులు, రుషికేష్ మాట్లాడుతూ తమ ఇంటికి వచ్చి క్షమాపణ చెప్పే వరకు స్వామి వారి రథోత్సవంలో పాల్గొనబోమని తేల్చి చెప్పారు. ఇది తమ సంఘ పెద్దలు తీసుకున్న నిర్ణయమన్నారు. సమావేశంలో పలువురు రథోత్సవం నిర్వాహకులు, విశ్వబ్రాహ్మణ సంఘ పెద్దలు పాల్గొన్నారు.



నేడు కలెక్టరేట్‌లో స్పందన

రాజమహేంద్రవరం రూరల్ ,మార్చి 3: రాజమహేంద్రవరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం యథాతథంగా జరుగుతుందని కలెక్టర్ మాధవీలత తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్పందన జరుగుతుందన్నారు. కలెక్టరేట్, రెవెన్యూ కార్యాలయాలు, మండల కార్యాలయాలు, సచివాలయాలు, మునిసిపాలిటీల్లో స్పందన నిర్వహిస్తున్నామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎంపీగారూ.. ఏం చేశారని..?



ఇదా అభివృద్ధి : డ్రైనేజీలు మూసివేయడంతో ఆర్ట్స్ కళాశాల గేటు ఎదుట నుంచి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

- ఎంపీ అని మరిచారా?
- అభివృద్ధి అంటే ఇదేనా!?
- ఏడు నియోజకవర్గాల మాటేంటి
- అభివృద్ధి పేరుతో నగరం అతలాకుతలం
- డ్రైన్లను పూర్తిగా మూసేసిన వైనం
- రోడ్లపైకి వస్తున్న మురుగునీరు
- పనుల్లో నాణ్యత కరువు
- తిప్పలు పడుతున్న జనం
- మిగతా నియోజకవర్గాలకు మొండిచేయి
- మళ్లీ దేనికి సిద్ధమని ప్రజల ప్రశ్న

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఓ ప్రజాప్రతినిధి అవగాహనాలేమి, ఆర్భాటాల ఆరాటానికి చారిత్రాత్మక రాజమహేంద్రవరం నవ్వులపాలవుతోంది.. అధికారుల డూడూ బసవన్నల తీరు, పనితనంపై జనం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీ నిధుల మాటే లేకుండా కార్పొరేషన్ నిధులతో పనికాని చేస్తున్నారు. నాణ్యతకు తిలోదకాలు ఇచ్చేసి 'షో'కులకు నిధులు విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. కమీషన్ల కక్కుర్తికి అభివృద్ధి అనే పేరు తగిలించి ఎన్నికల వేళ చేస్తున్న అతలాకుతలానికి ఇక్కట్లు పడుతున్నారు.

7 నియోజకవర్గాలకు ఏం చేశారు..

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఎక్కడా ఎంపీ భరత్‌రామ్ ప్రజలకు అవసరమైన పనులను పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి. దీంతో నియోజకవర్గాల్లోని రోడ్లు, డ్రైన్లు, వీధిలైట్లు వంటి మౌలిక సదుపాయాలు అస్తవ్యస్తంగా మారాయి. శివార్ల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. జిల్లా కేంద్రమైన రాజమహేంద్ర వరంలోని కార్పొరేషన్ పరిధికి ఆనుకొని ఉన్న పంచాయతీల్లోని ఆవాసాలకు ఇప్పటికీ గోదావరి నీళ్లందడం లేదు. డ్రైన్లు లేవు. చెత్త పన్ను వసూలు చేస్తున్నా చెత్తను తీసుకెళ్లడానికి వాహనాలు రావు. ఆనంద్‌నగర్ వంటి ప్రాంతాల్లో దోమలు,ఈగలు,పందులతో రోజూ పోరాటమే. కొవ్వూరు,నిడదవోలు, అనపర్తి, రాజానగరం, రాజమహేంద్రవరం రూరల్, గోపాలపురంలో ప్రజల సమస్యలను తీర్చే పనులు ఏమి చేశారో చెప్పాలని ప్రశ్నిస్తున్నాయి. ఈ ఐదేళ్లలో ఏడు నియోజకవర్గాలకు ఒరిగిందేమిటని జనాలు ప్రశ్నిస్తున్నారు. మళ్లీ తమరు దేనికి 'సిద్ధం' అంటూ ఎద్దేవా చేస్తున్నారు. గత ఎన్నికల హామీలను ఒక్కసారి గుర్తు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఎందుకంటే రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంపీ ఐదేళ్లుగా చేసిందేమీలేదు.

సమస్యలు గాలికొదిలేసి...

నగరాభివృద్ధికి వందల కోట్లు తెచ్చాం.. సుందరంగా చేశాం అంటూ ప్రతిరోజూ గాలిమాటలతో ఊదరగొడుతుంటారు. ఆ ప్రగల్భాలను నగరంలో రోడ్లపై పొంగిపొర్లుతున్న డ్రైన్లు, బీళ్ల అతికింపులో మరిచిన ఇంగితం, శివార్లలో పందులు, మురుగు కంపు వెక్కిరిస్తున్నాయి. జిల్లా కేంద్రాన్ని రూ.400 కోట్లతో(ఈ మాట అధికారులతో చెప్పించాలని మాత్రం అడగొద్దు సుమా! వాళ్ల నోటి వెంట రూ.70 కోట్లకు మించి రాకపోవచ్చు) అభివృద్ధి చేశామని సదరు ప్రజాప్రతినిధి పదేపదే అదేపనిగా చెబుతున్నారు. నగరాన్ని, పట్టణాలను పట్టిపీడిస్తున్న శాశ్వత సమస్యలకు..శివార్ల అభివృద్ధిని మాత్రం పక్కన పెట్టేశారు. మూణ్నాళ్ల ముచ్చటలో భాగంగా బాగున్న ఫుట్‌పాత్ రెయిలింగ్‌లను పీకేసి బీళ్లలు అతికించడం, లైట్లు ఉన్న చోట మళ్లీ లైట్లు వేయడం, కప్పుసాసర్లు నిర్మించడం, తూరలకు రంగులు వేసి రోడ్ల పక్కన పెట్టడం,బాలికల వసతి గృహాల నడుమ హోటళ్లు పెట్టించడం, విద్యాలయ వాతావరణాన్ని కలుషితం చేయడం వంటి మెగా ప్రాజెక్టులు చేపట్టారు. దీంతో యావ పాలకులది..తిప్పలు జనాలవి అన్నట్లుగా పరిస్థితి దాపురించింది.పైగా ఎన్నికల వేళ అభివృద్ధి పేరుతో సృష్టిస్తున్న విధ్వంసాన్ని చూస్తున్న జనం..ఇప్పటి వరకూ నిద్దరోయారా అంటూ ఓ నిట్టూర్పు విడుస్తున్నారు. మళ్లీ ఓటేస్తే ఏం చేస్తారో! అని భయాందోళనకు గురవుతున్నారు.

నిధులేం తెచ్చారని..

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో ఈ ఐదేళ్లలో ఎంపీగారు కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి ఏం అభి వృద్ధి పనులు చేశారనే ప్రశ్న వేస్తే సమాధానం చెప్పడం ఆయనకూ కాస్త కష్టమే.ఎంపీగా కేంద్ర ప్రభుత్వం నుంచి తెచ్చిన నిధుల ఊసు ఎప్పుడూ చెప్పరు. ఎంతసేపూ రాజమహేంద్రవరం మోరంపూడి ఫ్లైఓవర్ గురించి చెబుతూ.. ఫ్లెక్సీలను సైతం నింపేస్తున్నారు. వాస్తవానికి ఎంపీగా మురళీ మోహన్ ఉన్నప్పుడు ఇక్కడ ఫ్లైఓవర్ అవసరమని గుర్తించారు. దాంతో పాటు మరో నాలుగు ఫ్లైఓవర్లను కేంద్రం నుంచి మంజూరు చేయించారు. ఆయన హయాంలోనే శంకుస్థాపన కూడా చేశారు. తర్వాత ఎన్నికలు రావడం.. సాంకేతిక కారణాలతో ప్రాజెక్టు మొదలు కాలేదు.ఎంపీగా భరత్ రామ్ ఎన్నికైన నాలుగేళ్లకు ఆ ప్రాజెక్టు గుర్తుకొచ్చింది. భరత్ రామ్ హయాంలో మొదలు కావడంతో 'అన్నం వార్చిన వాడే వండినట్లు' అన్న చందంగా ఫ్లైఓవర్‌ని ఆయన ఖాతాలో వేసేసుకున్నారు. అది మినహా నగరానికి లేదా జిల్లాలోని మిగతా మునిసిపాలిటీలు,పంచాయతీలకు ఎంపీ స్థాయిలో చేసిన మేలు ఏమిటో ఫ్యాను గాలికే తెలియాలి. కనీసం ట్రాఫిక్ సమస్యలను తీర్చలేకపో యారు. ఎక్కడైనా అభివృద్ధి అంటే దానికి అనుగుణంగా రోడ్లు వెడల్పు చేస్తారు. కానీ వింతగా రాజమహేంద్ర వరంలో రోడ్లను కుచించేస్తున్నారు. దీంతో ఆయా కూడళ్లలో బస్సులు మలుపుతిరగడానికీ తిప్పలు పడాల్సి వస్తోంది. రాజమహేంద్రవరం సిటీలోని ఈట్ స్ట్రీట్, హ్యాపీస్ట్రీట్ అంటూ నిధులు గోల్‌మాల్ చేశారనే ఆరోపణలున్నాయి.



కార్మికులకెంత కష్టం..



రోడ్లపైనే చెత్త



సిల్ట్‌తో మూసుకుపోయిన డ్రైనేజీ

ఇదీ..అభివృద్ధేనా..!

వై.జంక్షన్ నుంచి లాలాచెరువు వరకూ ఫుట్‌పాత్‌లకు రెయిలింగ్ ఉండేది.దానిని తీసేసి ఫుట్‌పాత్‌లపై బీళ్లలు అతికించే పని చేపట్టారు. అంతం కాదిది ఆరంభం అనే తీరుగా ఈ పనులు కొనసాగుతున్నాయి.అయితే ఈ పనుల్లో ఇంజనీరింగ్ అద్భుతాలను చూసి జనం విస్తుపోతున్నారు. డ్రైనుపైన ఆ చివర నుంచి ఈ చివర వరకూ పూర్తిగా మూసేశారు.పూడిక ఎప్పటికప్పుడు తొలగించ డానికి ఎక్కడా నాలుగు స్లాబు బీళ్లలు వేయలేదు. ఆర్ట్స్ కళాశాల వద్ద వ్యర్థాలు పేరుకుపోయి గత గురువారం మురుగునీరు రోడ్డుపైకి వచ్చింది. పారిశుధ్య అధికారులు చేరుకున్నా.. ఎక్కడ తొలగించాలో (పగల గొట్టాలో) తోచక ఇంజనీరింగ్ అధికారులు వచ్చే వరకూ వేచి చూడాల్సి వచ్చింది. తర్వాత పారిశుధ్య కార్మికులు పీకల్లోతు మురుగు నీళ్లలో గంటల పాటు పూడిక క్లియర్ చేసే పనిచేయాల్సి వచ్చింది. ఇంజనీరింగ్,పారిశుధ్య అధికారులకు సమన్వయం కొరవడడం..అహాలకు పోవడంతో డ్రైన్లలో ఇలాంటి పరిస్థితి వస్తుందనే ఆరోపణలున్నాయి.

నిండు కుండకు కన్నం..

రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఇవ్వలేదు. కేంద్ర నుంచీ తీసుకొచ్చే సీన్ లేదు. జిల్లాలో రాజమహేంద్రవరం ఒకటే మునిసిపల్ కార్పొరేషన్. మిగతావన్నీ మునిసిపాలిటీలు,పంచాయతీలు.వీటిలో పెద్దగా జనరల్ ఫండ్స్ (ప్రజలు చెల్లించే పన్నులు) ఉండవు. మిగులు నిధులూ అంతంత మాత్రమే.కానీ రాజమహేంద్రవరం కార్పొరేషన్‌లో జనరల్ ఫండ్స్ ఎప్పుడూ నిండు కుండలా ఉంటాయి. వీటిపై ఎంపీగారి కన్ను పడడంతో నిండు కుండకు పెద్ద కన్నమే పడింది. మూణ్నాళ్ల ముచ్చట పనులకు జనరల్ ఫండ్స్ ఎడాపెడా ఖర్చు చేసేస్తున్నారు. కోట్లాది రూపాయలు జేబుల్లో పోసుకుంటున్నారు. కంబాల చెరువు పార్కు అభివృద్ధి అంటూ రూ.13 కోట్లు వెచ్చించారు. తీరాచూస్తే దోమలతో కుట్టించుకుంటూ దుర్వాసనను పీల్చడానికి టికెట్ పెట్టారు. పార్కుల అభివృద్ధి స్థానిక సంస్థల విధి. కానీ రాజమండ్రి విధి కమీషన్ల దారి పట్టడంతో కాసేపు సేదతీర దామనుకున్న ప్రజల నుంచి లక్షల రూపాయలు లాగేస్తున్నారు. చారిత్రక అనవాళ్లయిన సుబ్రహ్మణ్య మైదానాన్ని రూపురేఖలు లేకుండా చేసేశారు.రాజమహేంద్రవరంలోని వై.జంక్షన్ నుంచి లాలాచెరువు వరకూ గ్రాండ్ ట్రంక్ రోడ్ పేరుతో బీళ్లలు అతికించే బృహత్తర ప్రాజెక్టును చేపట్టారు. అప్పటి వరకూ ఉన్న రెయిలింగ్‌ను పీకేసి బూడిదపై బీళ్లల అతికింపునకు సుమారు రూ.7 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం మూడేళ్ల నుంచీ సుదీర్ఘంగా కొనసాగుతూనే ఉంది. ఈ పనుల్లోనూ నాణ్యత లేదు. సెంటర్ డివైడర్‌లో పెద్ద పెద్ద లైట్లు ఉండగా ఫుట్‌పాత్‌లపై మళ్లీ లైట్లు వేసి ఆర్భాటాన్ని చాటుకుంటున్నారు. రుడా ఏర్పాటు చేసిన మొక్కల కుండీల ఉద్దేశమేమిటో వాటికే బోధపడడం లేదు. వీటి అడ్డుతో చిరువ్యాపారులు రోడ్డుపైకి వచ్చారు. దీంతో రోడ్డుపై సంచరించే ప్రదేశం కుచించుకుపోయింది. దేవీచౌక్, పుష్కరాలరేవు కూడళ్లలో రాతి యుగాన్ని మళ్లీ కళ్లముందుకు తెచ్చారు. బాగున్న సర్ఫేస్‌ని తవ్వేసి రాళ్లు అతికించారు. అవి ఇప్పుడు గుంతలమయంగా మారాయి.వర్షం వస్తే నీళ్లు నిలిచిపోతున్నాయి. ఇలాంటి అనవసర పనులకు ఖర్చు చేసిన కోట్లాది రూపాయలతో రాజమహేంద్రవరంలోని డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికేదంటూ నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అసమర్థతకు, నిబద్ధతకు అదే తేడా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నిండు జీవితానికి.. రెండు చుక్కలు

పల్స్ పోలియో కార్యక్రమంలో కలెక్టర్ మాధవీలత



రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 3 : రెండు పోలియో చుక్కలతో చిన్నారులకు ఆరోగ్యవంతమైన జీవితాన్ని అందించవచ్చని కలెక్టర్ కె మాధవీలత అన్నారు. జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా రాజమహేంద్రవరం కంబాలపేట పట్టణ ఆరోగ్యకేంద్రంలో కలెక్టర్ చిన్నారులకు పోలియో చుక్కలు వేసి మాట్లాడారు.ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు, చుట్టుపక్కల ఉన్న చిన్నారులకు పోలియో చుక్కలు వేయించడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. జిల్లాలో ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయడం జరుగుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ సామాజిక భాగస్వామ్యం కావాలని కోరారు. జిల్లాలో లెక్కల ప్రకారం 1,90,479 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేయాల్సి ఉందని తెలిపారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, వైద్యాధికారులు, పట్టణ ఆరోగ్యకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపురం వైసీపీలో వర్గ విభేదాలు

చిన్నాయిగూడెంలో సమావేశానికి ఒక వర్గం గైర్హాజరు

దేవరపల్లి, మార్చి 3 : గోపాలపురం నియోజకవర్గ వైసీపీలో విభేదాలు భగ్గుమంటూనే ఉన్నాయి. ఒక వర్గం నాయకులు హోం మంత్రి వనితకు దూరంగా ఉంటున్నారు. దేవరపల్లి మండలంలోని సంగాయిగూడెం, చిన్నాయిగూడెం గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఆత్మీయ సమావేశాలు జరిగాయి. చిన్నాయిగూడెంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఒక వర్గం నాయకులు దూరంగా ఉన్నారు. ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఉన్నప్పటి నుంచి రెండు వర్గాల మధ్య అంతర్గత పోరు ఉంది. గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా హోం మంత్రి తానేటి వనితను నియమించిన తరువాత గోపాలపురం నియోజకవర్గ పరిశీలకుడు గన్నమని వెంకటేశ్వరరావు (జీవీ) ఇరు వర్గాలను కూర్చోబెట్టి సమన్వయంగా ఉండాలని సూచించారు.అయినా ఒక వర్గం నాయకులు ఆత్మీయ సమావేశాలకు దూరంగానే ఉంటున్నారు.దీంతో వర్గ విభేదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గతంలో ఉన్న విభేదాల కారణంగానే దూరంగా ఉంటున్నట్టు సమాచారం. అయితే వనిత వచ్చినా విభేదాలు మాత్రం వీడలేదు.



శిక్షణకు హాజరైన పోలీసులతో ఎస్పీ జగదీశ్

సైబర్ నేరాల అదుపునకు ప్రత్యేక శిక్షణ

రాజమహేంద్రవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై దర్యాప్తు అధికారులు, సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎస్పీ జగదీశ్ ఆదేశించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది సైబర్ నేరాలపై పూర్తి అవగాహన కలిగి ఉండడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన రక్షణ కల్పించవచ్చన్నారు. ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్ కుమార్ ఆదేశాలతో ఎస్పీ జగదీశ్ ఆధ్వర్యంలో జిల్లాలోని పోలీసు సిబ్బందికి సైబర్ నేరాలపై రెండు రోజుల పాటు ప్రాథమిక శిక్షణ నిర్వహించారు. లోన్‌యాప్‌లు, సోషల్ మీడియా, ఓటీపీ తదితర అంశాలకు సంబంధించిన మోసాలు, కాల్ డేటా విశ్లేషణ, బాధితులకు సహాయపడడం, వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఫోన్‌పే, గూగుల్‌పే, జీ-మెయిల్ తదితర వాటికి సంబంధించిన కేసుల్లో దర్యాప్తు వంటివి క్లుప్తంగా వివరించారు. ఆయా పోలీస్ స్టేషన్ల నుంచి హాజరైన 30 మంది సిబ్బందికి సీఐ జి.ఉమామహేశ్వరరావు, ఎస్ఐ ఎం.అయ్యప్పరెడ్డి, కానిస్టేబుల్స్ వైఎస్వీ సురేశ్, జే.రవికుమార్, అబ్దుల్ షౌకత్, కవిత, ప్రియదర్శిని సైబర్ నేరాలపై తర్ఫీదునిచ్చారు.



కోకో కేజీ రూ.500

రికార్డు ధర - రైతాంగం ఆనందం

పెరవలి, మార్చి 3 : కోకో గింజల ధర గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయికి చేరింది. ఏకంగా కేజీ రూ.500ల విక్రయిస్తున్నారు. గతేడాది రూ. 240లు పలికిన ధర క్రమంగా పెరిగి 300, 350,400 నుంచి ప్రస్తుతం రూ.500లకు చేరింది. దీంతో కోకో పండించే రైతాంగం ఆనందంగా ఉన్నారు. కోకో గింజలు కొనుగోలు చేసే కంపెనీల మధ్య పోటీ ఏర్పడి ఈ విధంగా ధర పెరుగుతున్నట్టు కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. డిమాండ్ తగిన ఉత్పత్తి లేకపోవడం కూడా మరో కారణం అంటున్నారు. ఏదైమైతేనేం ధర పెరగడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరింత సాగు చేసే దిశగా ఆలోచన చేస్తున్నారు.



అమ్మా.. కోటసత్తెమ్మ

నిడదవోలు, మార్చి 3 : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ అమ్మవారిని ఆది వారం భక్తులు పెద్దఎత్తున దర్శించుకుని విశేష పూజలు చేశారు.ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళ లాడింది. అమ్మవారికి ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి క్షీర నివేదన, మహానివేదన చేశారు.భక్తులు అమ్మవారిని పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దర్శనం కలగజేశారు. ఆదివారం అమ్మవారికి మొత్తం రూ.1,28,141లు ఆదాయం లభించినట్టు ఆలయ కార్య నిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు.

రాజమహేంద్రవరం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి



ప్రభుత్వాసుపత్రిలో ప్రైవేటు వల


ఓపీ ప్రభుత్వాసుపత్రిలో.. వైద్యం సొంత ఆసుపత్రుల్లో..

- మల్టీస్పెషాల్టీ వైద్యసేవల పేరుతో తిష్ట
- అందుబాటులో ఉండని వైద్యులు
- చార్టు సమయం ఎగవేత
- అప్పుడప్పుడు వచ్చి రోగులకు వల
- సేవ ముసుగులో సా..గుతున్న దోపిడీ
- నాడు సరే.. మరిప్పుడెందుకు ?
- బోధనాసుపత్రిగా మారినా ఇంతే

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 3 : మల్టీస్పెషాలిటీ వైద్యసేవల పేరుతో ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల వైద్యులు రాజమహేంద్రవరం జీజీహెచ్‌లో తిష్ట వేయడం ఆసుపత్రి వైద్యులు, ఉద్యోగ వర్గాల్లో తీవ్ర చర్చ రేపుతోంది. జిల్లా ఆసుపత్రి స్థాయి నుంచి బోధనాసుపత్రి, సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్)గా ఎదిగినా ఆసుపత్రి అధికారులు నేటికీ ప్రైవేట్ వైద్యుల సేవలను వినియోగించుకోవడం అందరికీ విస్మయాన్ని కల్గిస్తోంది. దీంతో మల్టీస్పెషాలిటీ వైద్యసేవల మతలబు ఏమిటనేదానిపై అందరిలోనూ ఆరా మొదలవుతోంది. అసలు ఇక్కడ రోగులకు అందుతున్న సూపర్ వైద్యం ఏమిటి ? అసలు ప్రయోజనం ఉంటోందా ? కేవలం ఓపీ కోసం ప్రభుత్వాసుపత్రిలో ప్రైవేట్ వైద్యం అవసరమా అనే చర్చ జరుగుతోంది. కొందరు స్పెషలిస్టు వైద్యులు వారానికి ఒకసారి వస్తే, మరికొందరు రెండుసార్లు వస్తుంటారు. ఇలా వారానికి ఒకసారి, వారానికి రెండు సార్లు చూసే ఓపీ వల్ల ఎవరికి ప్రయోజనం కలుగుతోంది, మరెవరికి మేలు జరుగుతోంది అనే సందేహాలు జనంలో కలుగుతున్నాయి. స్పెషలిస్టు వైద్యులు ఓపీ చూసిన తర్వాత మందులు రాస్తుంటారు. ఈ మందులు ఎక్కడ కొనుక్కోవాలి. ఎక్స్‌రే, స్కానింగ్, ఎంఆర్ఐ వంటి పరీక్షలు రాస్తుంటారు. రిపోర్టులు రెండు, మూడు రోజుల వరకూ రావు. వీటిని ఎవరికి చూపించుకోవాలి అనే సందేహాలు అందరిలోనూ మెదులుతున్నాయి.

ఏ డాక్టర్ ఎప్పుడొస్తారో తెలియని దైన్యం ...

మల్టీ స్పెషాలిటీ ఓపీ వైద్యసేవలకు ఏ డాక్టర్ ఏ రోజున వస్తారో ఒక చార్టు ప్రిపేర్ చేశారు. సోమ, శుక్ర, శనివారాల్లో న్యూరాలజీ, బుధ, శుక్ర వారాలు కార్డియాలజీ, బుధ, గురు, శనివారాలు న్యూరో సర్జరీ, బుధ, గురు వారాలు గ్యాస్ట్రోఎంట్రాలజీ, గురువారం ప్లాస్టిక్ సర్జరీ, నెఫ్రాలజీ, బుధవారం యూరాలజీ, శనివారం పిడియాట్రిక్ సర్జరీ, మంగళవారం సర్జికల్ అంకాలజీ, సోమవారం రేడియేషన్ అంకాలజీ, శుక్రవారం ఎండోక్రైనాలజీ స్పెషలిస్టు డాక్టర్లు అందుబాటులో ఉంటారని బోర్డులు పెట్టారు. ఇప్పుడు ఈ చార్టు మొక్కుబడిగా మారింది. ఏ డాక్టర్ ఎప్పుడు వస్తారో తెలియని దైన్యం నెలకొంది. ప్రతిరోజూ డాక్టర్లకు ఫోన్లు చేసి వస్తున్నారో లేదో తెలుసుకునే డ్యూటీ సైక్రియాటిక్ విభాగంలో కౌన్సిలర్‌గా పనిచేసే ఒక కాంట్రాక్టు ఉద్యోగిని చూస్తుంటారు. సంబంధిత డాక్టర్ వస్తున్నారా లేదా అనేది ఉదయం పది గంటల సమయంలో తెలుసుకుని ఆసుపత్రి ఉద్యోగుల వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేయడం జరుగుతుంది. అయితే స్పెషలిస్ట్ వైద్యుల సమాచారం ముందుగా రోగులకు తెలియకపోవడంతో రోగులకు తిప్పలు తప్పడంలేదు.



... The Public are Requested to Utilise the Service
MULTI-SPECIALITY OP [02:00 PM TO 04:00 PM]
GGH RAJAMAHENDRAVARAM

S.No	Name of the Speciality	Day the Spl. Doctor Available
1	Neurology / న్యూరాలజీ	Monday, Friday, Saturday
2	Cardiology / కార్డియాలజీ	Wednesday, Friday
3	Neuro Surgery / న్యూరో సర్జరీ	Wednesday, Thursday, Saturday
4	Gastroenterology / గ్యాస్ట్రోఎంటరాలజీ	Wednesday, Thursday
5	Plastic Surgery / ప్లాస్టిక్ సర్జరీ	Thursday
6	Nephrology / నెఫ్రాలజీ	Thursday
7	Urology / యూరాలజీ	Wednesday
8	Peadiatric Surgery / పీడియాట్రిక్ సర్జరీ	Saturday
9	Surgical Oncology	[illegible]

దోపిడీ సాగుతుందిలా..

మల్టీస్పెషాలిటీ పేరుతో సాగుతున్న ప్రైవేట్ వైద్యసేవలపైనా తీవ్రస్థాయిలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డాక్టర్‌తో పాటు వచ్చే సహాయకులు రోగుల వివరాలు, ఫోన్ నెంబర్లు సేకరించి ఆ తర్వాత ఫాలో అప్ చేస్తుంటారనే ఫిర్యాదులున్నాయి. ప్రభుత్వాసుపత్రిలో ఓపీ చూసిన తర్వాత ఆ రోగులను మెరుగైన వైద్యం కోసం అంటూ తమ సొంత ఆసుపత్రులకు తరలించుకుపోతున్నారనే ఆరోపణలున్నాయి. మొదటి నుంచీ ఇలాంటి విమర్శలు వస్తున్నా అప్పుడు, ఇప్పుడూ ఆసుపత్రి అధికారులు దీనిపై దృష్టిసారించకపోగా కనీసం సమీక్షించిన దాఖలా కూడా లేదు.

ఏడాదిన్నరగా ప్రైవేటు సేవలు..

ఏడాదిన్నర కిందట వరకూ రాజమహేంద్రవరం జిల్లా ప్రభుత్వాసుపత్రి ఏపీ వైద్యవిధానపరిషత్ కింద ఉండేది. అప్పట్లో జిల్లా ఆసుపత్రి కొచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడానికంటూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సహకారంతో ప్రైవేట్ వైద్యుల సేవలకు అధికారులు పచ్చజెండా ఊపారు. రాజమహేంద్రవరంలోని కార్పొరేట్ ఆసుపత్రుల నుంచి రోజుకు ఒక స్పెషలిస్టు వైద్యుడు జిల్లా ఆసుపత్రికి వచ్చి ఓపీ చూసేవారు. కేవలం ఓపీ చూసి వైద్యపరీక్షలు చేసి మందులు రాయడానికి మల్టీస్పెషాలిటీ వైద్యులను తీసుకొచ్చినా ఆ తర్వాత ఇక్కడ జరిగే తతంగం మరోలా మారింది. ఆ తర్వాత జిల్లా ఆసుపత్రిని బోధనాసుపత్రిగా మార్చుతూ డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ 2022, మే 16న జీవో జారీ చేశారు. ఆసుపత్రి స్థాయి పెరగడంతో పలు విభాగాలకు హెచ్‌వోడీలు, నర్సింగ్ స్టాఫ్, ఇతర పారా మెడికల్ సిబ్బంది వచ్చారు. ఇటీవలే నలుగురు స్పెషలిస్టు వైద్యులను డీఎంఈ నుంచి నియమించారు. క్యాన్సర్‌కు సంబంధించిన సర్జికల్ అంకాలజీ, రేడియేషన్ అంకాలజీ, న్యూరో ఫిజీషియన్, న్యూరో సర్జన్లు విధుల్లో చేరారు. మరికొందరు రావాల్సి ఉంది. స్పెషలిస్టు వైద్యులు పూర్తిస్థాయిలో లేరనే సాకుతో ప్రైవేట్ ఓపీ సేవలను కొనసాగించడం కార్పొరేట్ ఆసుపత్రులకు మేలు చేయడమేననే అభిప్రాయం సామాన్య జనాల్లో వ్యక్తమవుతోంది.

సూపర్‌సిక్స్ పథకాలను ఇంటింటికీ చేరవేయాలి

టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు



సూపర్‌సిక్స్ పథకాల టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ద్విసభ్య కమిటీ

కొవ్వూరు, మార్చి 3: టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను శంఖారావం కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికి చేరవేయాలని నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జిలతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి కుటుంబాన్ని కలిసి సూపర్‌సిక్స్ పథకాలను తెలియజేయాలని, వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను వివరించాలన్నారు. రాజకీయ లబ్ధి కోసమే జగన్‌రెడ్డి బాబాయ్ వివేకానందరెడ్డిని హతమార్చారన్నారు. తండ్రిని హత్యచేసిన వారిని శిక్షించాలని సునీతారెడ్డి న్యాయపోరాటం చేస్తుంటే అందుకు సహకారం అందించవలసిన జగన్‌రెడ్డి.. అవినాష్‌రెడ్డిని సీబీఐ అరెస్టు చేయకుండా అడ్డుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో దాయన రామకృష్ణ, నామన పరమేష్, రాజాన శ్రీనివాస్, మరపట్ల కళాధర్, పెనుమాక జయరాజు, సిద్దా దుర్గాప్రసాద్, అన్నమరెడ్డి రాజబాబు, మహ్మద్ అల్తాఫ్ పాల్గొన్నారు.

కొవ్వూరు చేరుకున్న రాజేంద్రనాథ్ పాదయాత్ర

కొవ్వూరు, మార్చి 3: జగన్మోహనరెడ్డి మరలా సీఎం కావాలని రాజవోలు నుంచి గౌరీపట్నం వరకు నక్కా రాజేంద్రనాథ్ చేపట్టిన పాదయాత్ర ఆదివారం కొవ్వూరు చేరుకుంది. ఆయనకు మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, రాజేష్ స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిత్వానికి కేశవ దరఖాస్తు



దరఖాస్తు అందజేస్తున్న గెల్లా కేశవ

కొవ్వూరు, మార్చి 3: బీజేపీ కొవ్వూరు నియోజకవర్గ అభ్యర్థిత్వానికి కొవ్వూరుకు రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడు గెల్లా కేశవ దరఖాస్తు అందజేశారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానందంకు దరఖాస్తు అందజేశారు. ఏడేళ్లుగా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న తనకు కొవ్వూరు బీజేపీ అసెంబ్లీ టిక్కెట్టును కేటాయించాలని కోరానన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు

టీడీపీ గోపాలపురం ఎస్సీసెల్ కార్యదర్శి రవి

గోపాలపురం, మార్చి 3: స్థానిక పెద్దగూడెంలో కొన్ని నెలల క్రితం సచివాలయం నిధులు రూ.20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారని టీడీపీ మండల ఎస్సీసెల్ కార్యదర్శి దాసరి రవి అన్నారు. గ్రామంలో నిర్మించిన ప్రధాన రహదారికి ఇరువైపులా అనుసంధాన రోడ్ల పనులు పూర్తి చేయకుండానే బిల్లులు మంజూరు ఎలా అయ్యాయని ఆయన ప్రశ్నించారు. నాణ్యత లేకుండా రహదారి నిర్మించడంతో అప్పట్లో నిరసన కార్యక్రమం చేపట్టగా అధికారులు, గుత్తేదారులు రహదారిపై సింగిల్ లేయర్ రోడ్డు వేస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు వేయలేదన్నారు. అనుసంధాన రోడ్లు, రెయిలింగ్‌లు అసంపూర్తిగా వదిలేయడంతో ఆ గోతుల్లో పడి గ్రామస్థులు ప్రమాదాల బారినపడుతున్నారన్నారు. రోడ్డు నిర్మించిన రెండు నెలలకే బీటలు వారడం, రాళ్లు లేచిపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో చినవెంకటేష్, మొయ్యేటి శ్యామ్, గంజి బాలకృష్ణ, నక్కా ప్రభాకర్, నలమాటి రాజేష్, నాని, శాంతకుమారి పాల్గొన్నారు.

సుబ్రహ్మణేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



సుబ్రహ్మణేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

తాళ్లపూడి, మార్చి 3: మండలంలోని బల్లిపాడులో విశ్వేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో దుగ్గిరాల వెంకటరత్నం, భాస్కరం దంపతులు నిర్మించిన సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నూతన విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయార్చకులు యంత్ర స్థాపన, పరివార విగ్రహ ప్రతిష్ఠ అనంతరం స్వామివారికి శాంతి కల్యాణం జరిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మల్లేశ్వరంలో మహాకుంభాభిషేకం

పెరవలి, మార్చి 3: మల్లేశ్వరంలో కపిల మల్లేశ్వరస్వామి ఆలయంలో మహా కుంభాభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు ఆయన సతీమణి సుమలత, కుమారుడు వరుణ్‌సాయి పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

వాకింగ్ చేస్తున్న ముగ్గుర్ని ఢీకొన్న బైక్

దేవరపల్లి, మార్చి 3: మండలంలోని యర్నగూడెంలో జాతీయ రహదారిపై తెల్లవారుజామున వాకింగ్ చేస్తున్న ముగ్గుర్ని గుర్తుతెలియని వ్యక్తి వెనక నుంచి బైక్‌తో ఢీకొన్నాడు. దీంతో గ్రామానికి చెందిన అల్లూరి రాజుకు తీవ్రగాయం కావడంతో 108వాహనంలో దేవరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. మిగిలిన ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి.

రైలు ఢీకొని వృద్ధురాలి మృతి

నిడదవోలు, మార్చి 3: నిడదవోలులోని చిన కాశీరేవు సమీపంలో సుమారు 70 ఏళ్ల వయసున్న వృద్ధురాలిని గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో మృతిచెందింది. రైల్వే ఎస్ఐ జి.శ్రీహరిబాబు వివరాల ప్రకారం.. మృతురాలు గుండు చేయించుకుని ఉందని, ఏదో ఆసుపత్రిలో చికిత్సకు సంబంధించి ఆమె ముక్కుకి లిక్విడ్‌పైప్ వేసి ఉందని తెలిపారు. మృతురాలి ఆచూకీ గుర్తించిన వారు ప్రభుత్వ రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

వారంలో సచివాలయం తెరవాలి : వనిత

దేవరపల్లి, మార్చి 3: నాయకుల మధ్య సచివాలయ సిబ్బంది నలిగి పోతున్నారు. సంగాయి గూడెం సచివాలయం సుమారు ఏడాది కిందట ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రారంభించారు. అయితే ఒక వర్గంలో సచివాలయంలో విధులు నిర్వహించాలని చెబుతుండగా మరో వర్గం అడ్డుకోవడంతో ఇప్పటి వరకూ సచివాలయానికి తాళం వేసి ఉంచుతున్నారు. ఈ విషయం హోం మంత్రి వనిత దృష్టికి వెళ్లడంతో పంచాయతీ కార్య దర్శి ఆర్.అమ్మిరాజుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో విధులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో గ్రామ కమిటీ అధ్యక్షుడు సుంకవల్లి శ్రీనివాస్, ఎంపీటీసీ సుంకవల్లి చినవెంకట నాగదుర్గ, ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఏఎంసీ చైర్మన్ జనార్ధన్, గడా జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

పన్నుల చెల్లింపులకు ప్రత్యేక కౌంటర్లు

మునిసిపల్ కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 3: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలోని ఆస్తి పన్నుల బకాయిదారులకు నగరంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని కమిషనర్ దినేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నగరంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి బకాయి పడిన ఆస్తి పన్నుల వడ్డీ మాఫీ చేస్తూ ప్రభుత్వం ఉత్త ర్వులు జారీ చేసిందన్నారు. ఈ మేరకు పీఎల్‌పురం సచివాలయం 23, ప్ర కాష్‌నగర్ సచివాలయం-14, సీతంపేట సచివాలయం-81, కోటిపల్లి బస్టాండ్ సచివాలయం-36, నారాయణపురం సచివాలయం-3, బొగ్గులదిబ్బ సచివాలయం-42లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు పన్నులు చెల్లించవచ్చునని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కమిషనర్ అన్నారు.

సూర్యనారాయణుడికి పంచామృతాభిషేకాలు

కొవ్వూరు, మార్చి 3: కొవ్వూరు సంస్కృత పాఠశాల ప్రాంగణంలోని గోష్పదేశ్వరస్వామి ఆలయంలో సూర్యనారాయణ మూర్తికి ఆదివారం పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ఆలయార్చకులు విశేష అభిషేకాలు, అర్చనలు, సూర్యనమస్కారాలు అందించారు.

పోలియో రహిత సమాజానికి కృషి



ఉండ్రాజవరం: పాలంగిలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ యల్లారీశ్వరి

- జిల్లాలో 1,90,470 మంది పిల్లలకు పల్స్‌పోలియో
- 1060 కేంద్రాలు ఏర్పాటు: డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు

తాళ్లపూడి, మార్చి 3: నూరు శాతం పిల్లలకు పోలియో చుక్కలు వేసి పోలియో రహిత సమాజం కోసం కృషి చేయాలని డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు చెప్పారు. పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పలుచోట్ల ఆదివారం నిర్వహించారు. తాళ్లపూడి మండలంలోని గజ్జరం, తాళ్లపూడి, వేగేశ్వరపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన పోలియో కేంద్రాలను డీఎంఅండ్ హెచ్‌వో సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా మొత్తం మీద 1,90,470 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు ఏర్పాట్లు చేశామని, అందుకు 1060 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోని వారికి 4, 5 తేదీల్లో వేయాలని మొబైల్ టీమ్‌లకు ఆదేశాలిచ్చామన్నారు. నూరు శాతం పిల్లలకు పోలియో చుక్కలు వేయడం ద్వారా పోలియో రహిత సమాజం కోసం కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హారికా గుప్త, జి.సుజాత, ఎం.విజయకుమారి, కె.బుజ్జమ్మ, కృపావరం వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులోని రోటరీ ఆడిటోరియమ్‌లో పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు మాట్లాడుతూ చిన్నారుల జీవితానికి రెండు చుక్కలు పోలియో దరిచేరకుండా రక్షణ ఇస్తుందన్నారు. భారతదేశంలో పోలియో నిర్మూలనకు అంతర్జాతీయ రోటరీ



నిడదవోలు చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న కీర్తి ఆంజనేయులు

సంస్థ కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ పోలదాసు శ్రీనివాసరావు, గోపిరెడ్డి శ్రీనివాస్, గుంటుపల్లి శివకుమార్, కాళ్ల రాంబాబు, గొన్నాబత్తుల రామారావు పాల్గొన్నారు.

దేవరపల్లి: మండలంలో దేవరపల్లి, యాదవోలు, గౌరీపట్నం పీహెచ్‌సీల పరిధిలో ఉన్న ప్రతి గ్రామంలో కేంద్రాలు ఏర్పాటు చేసి ఐదేళ్లలోపు లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేశారు. దేవరపల్లి పీహెచ్‌సీలో ఎంపీపీ కేవీకే దుర్గారావు పిల్లలకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని



కొవ్వూరులో పోలియో చుక్కలు వేస్తున్న బావన రత్నకుమారి

ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, వైద్యాధికారులు సాంబశివరావు, సంజీవ్‌కుమార్, సీహెచ్‌వో అప్పారావు, కూచిపూడి సతీష్, సర్పంచ్ వీరకుమారి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

దొమ్మేరులో 96శాతం

కొవ్వూరు: కొవ్వూరు 19వ వార్డులో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి ప్రారంభించారు. కొవ్వూరు మండలం వాడపల్లిలో ఎంపీపీ నారాయుడు, దొమ్మేరు పీహెచ్‌సీలో డాక్టర్ ఎస్.ధర్మరాజు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ధర్మరాజు మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో 28 బూత్‌లు, ఒక మొబైల్ టీము ద్వారా 120 మంది వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు సేవలందించారన్నారు. 12 సచివాలయాల్లో ఐదేళ్లలోపు పిల్లలు 4485మంది ఉన్నారని, 4287మంది (96శాతం)కి పోలియో చుక్కలు వేశామన్నారు. ఆదివారం అందుబాటులో లేని పిల్లల కోసం 4, 5 తేదీల్లో ఆశ, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలతో కూడిన బృందాలు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేస్తారని, ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా వేయించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు సీహెచ్ దివ్య, కె.ప్రణీత, సూపర్‌వైజర్లు, వైద్య, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



తాళ్లపూడి: వేగేశ్వరపురంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు

ఉండ్రాజవరంలో 95శాతం

ఉండ్రాజవరం: మండలంలోని వేలివెన్నులో జడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, పాలంగిలో ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి చుక్కలు వేసి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాలంగిలో ఎంపీడీవో కె.నరేంద్ర రెడ్డి, సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, పీహెచ్‌సీ డాక్టర్లు ఆర్ఎస్ ప్రసాద్, ఉషాదేవి, సీహెచ్‌వో సుబ్రహ్మణ్యం, పీహెచ్ఎన్ డీఎల్ కుమారి, పాలాటి శరత్‌బాబు పాల్గొన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ టీమ్ సభ్యులు మండలంలోని దమ్మెన్ను, మోర్త, ఉండ్రాజవరం, పాలంగి గ్రామాల్లో బూత్‌లను తనిఖీ చేశారు. మండలంలో ఐదేళ్లలోపు పిల్లలు 5059 మందికి గాను 4815 మంది(95శాతం)కి పోలియో చుక్కలు వేసినట్టు డాక్టర్ ప్రసాద్ తెలిపారు.

చాగల్లులో 98 శాతం

చాగల్లు: మండలంలోని నాలుగు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 9770 మంది చిన్నారులకు గాను 9670 మంది(98శాతం)కి పోలియో చుక్కలు వేసినట్టు వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమాల్లో నాలుగు పీహెచ్‌సీల వైద్యులు, విస్తరణాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పెరవలిలో 8538 మందికి..

పెరవలి: మండలంలోని పెరవలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 4,507 మంది, కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 4,031 మంది పిల్లలకు పోలియోచుక్కలు వేసినట్టు వైద్యాధికారులు తెలిపారు. నల్లాకులవారిపాలెంలో సర్పంచ్ నల్లాకుల వెంకటేశ్వరరావు పల్స్‌పోలియో కార్యక్రమంలో పాల్గొన్నారు.



దేవరపల్లిలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ దుర్గారావు

పారిశ్రామికాభివృద్ధితో యువతకు ఉపాధి కల్పన



సమావేశంలో మాట్లాడుతున్న మద్దిపాటి వెంకట్రావు

- టీడీపీ గోపాలపురం ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు

నల్లజర్ల, మార్చి 3: గోపాలపురం నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధి చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తానని టీడీపీ ఇన్‌చార్జీ మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. ఆదివారం రాత్రి నల్లజర్లలోని యద్దనపూడి బ్రహ్మరాజు వెంచర్‌లో నిర్వహించిన యువ ఓటర్ల సదస్సులో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో యువతకు ఉపాధి అవకాశాలు లేవన్నారు. నియోజకవర్గంలో పరిశ్రమలు స్థాపనకు భూములు, మౌలిక, రవాణా సదుపాయాలు, నీటి సరఫరా పుష్కలంగా ఉందని, రాబోయే రోజుల్లో ప్రకృతికి హాని చేయని పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగు యువతకు ఉపాధి కల్పిస్తానన్నారు. నియోజకవర్గంలో 90 వేల నిరుద్యోగ యువత ఉందని, వారికి ఉపాధి కల్పించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. కొత్తగా హోంమంత్రి వైసీపీ అభ్యర్థిగా వచ్చి పోలీసులతో తమ ఫ్లెక్సీలు తొలగిస్తున్నారని, అక్కడ చెత్త ఇక్కడ బంగారం కాదని గుర్తు పెట్టుకోవాలన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీని గెలిపించి చంద్రబాబును సీఎం చేయాలన్నారు. కార్యక్రమంలో ద్వారకాతిరుమల అధ్యక్షుడు లంకా సత్యనారాయణ, దేవరపల్లి అధ్యక్షుడు అంద్రు అనిల్, నల్లజర్ల అధ్యక్షుడు నిమ్మలపూడి ప్రసాద్, కండెపు వెంకటరత్నం, యలమాటి శ్రీను, పసుమర్తి రతీష్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణుల అభివృద్ధి టీడీపీ-జనసేనతో సాధ్యం



సభలో ప్రసంగిస్తున్న ఆదిరెడ్డి వాసు

- 150 స్థానాల్లో టీడీపీ-జనసేన అభ్యర్థులదే విజయం
- విశ్వబ్రాహ్మణ ఆత్మీయ సభలో టీడీపీ, జనసేన నేతలు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 3: విశ్వబ్రాహ్మణులు అభివృద్ధి, సంక్షేమం టీడీపీ-జనసేనతోనే సాధ్యమని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. రాజమహేంద్రవరం హోటల్ జగదీశ్వరీలో ఆదివారం పార్టీ తాడేపల్లిగూడెం పరిశీలకుడు నక్కా చిట్టిబాబు అధ్యక్షతన టీడీపీ-జనసేన ఆధ్వర్యంలో విశ్వబ్రాహ్మణ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని మాట్లాడుతూ జగన్ రాక్షస పాలనను అంతమొందించే సమయం వచ్చిందన్నారు. ఒక్క అవకాశం ప్రజలు ఇచ్చినందుకు రాష్ట్రం 20 ఏళ్ళు వెనక్కి వెళ్లిపోయిందన్నారు. ఇటువంటి తరుణంలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలంటే చంద్రబాబును సీఎం చేయాలన్నారు. రాష్ట్రంలో టీడీపీ-జనసేన కూటమికి 150 స్థానాలు వస్తాయన్నారు. తన భర్త ఆదిరెడ్డి వాసును రాజమహేంద్రవరం ప్రజలందరు ఆశీర్వదించాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల సంక్షేమం చూసింది టీడీపీ అన్నారు. రాష్ట్రంలో ఆదరణ పథకాన్ని తీసివేసిన జగన్ నవరత్నాలు పెట్టి అందులో మీ రత్నం ఎక్కడుందో వెతుక్కోమంటున్నాడని మండిపడ్డారు. టీడీపీ-జనసేన కూటమిని అధికారంలోకి తీసుకురావాలన్నారు. ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. నగరంలో అన్ని సౌకర్యాలతో ఒక కమ్యూనిటీ హాలు నిర్మించడం, గోదావరి బండ్‌పై విశ్వబ్రహ్మ విగ్రహం ఏర్పాటు చేస్తామన్నారు. టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రాగానే తాను అనుశ్రీ సత్యనారాయణతో కలిసి విశ్వబ్రాహ్మణుల్లో 45 ఏళ్లు పైబడిన వారికి పింఛను ఇచ్చే విషయాన్ని తమ నేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌ల దృష్టికి తీసుకెళ్లి అమలు చేసేలా ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. అనుశ్రీ సత్యనారాయణ మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమం టీడీపీ-జనసేన కూటమితోనే సాధ్యమన్నారు. నక్కా చిట్టిబాబు, విశ్వబ్రాహ్మణ సంఘం నూతన అధ్యక్షుడు పాలవలస వీరభద్రం విశ్వబ్రాహ్మణుల సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.అనంతరం నూతన కమిటీతో బుడ్డిగ రాధా ప్రమాణస్వీకారం చేయించారు. సమావేశంలో టీడీపీ నాయకులు యర్రా వేణుగోపాలరాయుడు, కాశి నవీన్‌కుమార్, నక్కా దేవివరప్రసాద్, కుడుపూడి సత్తిబాబు, మజ్జి రాంబాబు, కొయ్యల రమణ, మరుకుర్తి రవియాదవ్, సింహా నాగమణి, విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు లక్కోజు వీరభద్రరావు, చించినాడ తాతాజీ, వీరమళ్ళ సత్తిబాబు, అములోజు శివప్రసాద్ పాల్గొన్నారు.

వైసీపీకి మరో చాన్స్ ఇస్తే రాష్ట్రం అధోగతి

- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, మార్చి 3: ఒక్క చాన్స్ పేరుతో వైసీపీ అధికారం చేపట్టి రాష్ట్రాన్ని అభివృద్ధిలో వెనక్కినెట్టిందని, మరో చాన్స్ ఇస్తే అధోగతి పాలు చేస్తుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన కుతుకులూరులో పర్యటించారు. గ్రామంలో మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని వ్యవస్థలను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. అవగాహన లేని వ్యక్తులకు అధికారం అప్పగిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ప్రజలు పూర్తిగా అర్థం చేసుకున్నారన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి గ్రామంలోని స్టీవెన్ చర్చిని సందర్శించి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సూర్రెడ్డి, కర్రి చిన్నారెడ్డి, తేనెల శ్రీనివాస్, నల్లమిల్లి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక

మండలంలోని రామవరంలో బిక్కవోలు మండలం పందలపాక గ్రామానికి



టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలతో రామకృష్ణారెడ్డి

చెందిన టీడీపీ నాయకుడు పడాల వెంకటరామారెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు చాపల చిట్టిబాబు, ఉండ్రాజవరపు శ్రీను, కోడి మధుకిరణ్, వడ్లపాటి దుర్గాప్రసాద్‌లతో బాటు పదిహేను కుటుంబాల వారు టీడీపీలో చేరారు వారికి రామకృష్ణారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో అనసూరి నాగేశ్వరరావు, సబ్బెళ్ళ విజయభాస్కరరెడ్డి, పందలపాక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన కూటమిని గెలిపించాలి

ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి

రాజమహేంద్రవరం రూరల్, మార్చి 3: టీడీపీ-జనసేన కూటమిని అధికారంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. టీడీపీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పిడింగొయ్యి పంచాయతీ శాంతిపురంలో ఆదివారం టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు మార్రి వాసుదేవ్, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మావతి, బొప్పన నాగేశ్వరరావు, యార్లగడ్డ శేఖర్, కుంచె హనుమంతరావు, మట్టా శ్రీను, మార్ని శ్రీను, బాబుఖాన్, బొప్పన శ్రీను పాల్గొన్నారు.

వైసీపీ ఓటమికి సమష్టిగా పనిచేద్దాం: బీవీఆర్

రాజానగరం, మార్చి 3: రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సమష్టిగా పనిచేద్దామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణచౌదరి పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన పార్టీ శ్రేణుల ఉమ్మడి ఆత్మీయ సమావేశం రాజానగరంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా బీవీఆర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో జనసేన-టీడీపీ పార్టీల ఉమ్మడి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని, అందుకు అందరూ సమైక్యంగా కృషి చేద్దామన్నారు. బత్తుల మాట్లాడుతూ విముక్త ఆంధ్రప్రదేశ్ కోసం, రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం జనసేన-టీడీపీ శ్రేణులు సమష్టిగా పనిచేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. రానున్న ఎన్నికల్లో రాజానగరం నియోజకవరాన్ని అత్యధిక మెజార్టీ సాధించి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌కు బహుమతిగా అందిద్దామన్నారు.

వచన కవితలు గ్రంథావిష్కరణ

రాజమహేంద్రవరం, మార్చి 3: అది వచనమైనా, పద్యమైనా, ప్రవచనమైనా, ఏ ప్రక్రియ అయినా సరే అందులో కవిత్వం ఉండాలని సంస్కృతాంధ్ర శతావధాని డా.పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ అన్నారు. గౌతమి గ్రంథాలయంలో ఆదివారం ఓఎన్‌జీసీ విశ్రాంత డీజీఎం కవితా ప్రసాద్ విరచిత వచన కవితలు గ్రంథావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సప్పా దుర్గాప్రసాద్, డా.అరిపిరాల నారాయణరావు, యార్లగడ్డ మోహనరావు, వీవీ సుబ్రమణ్యం, బీహెచ్ రమాదేవి, పీవీబీ.సంజీవరావు, దీక్షితుల సుబ్రహ్మణ్యం సత్కరించారు. కార్యక్రమంలో కళాగౌతమి వ్యవస్థాపకుడు బీవీఎస్ మూర్తి, కవి జొరాశర్మ, జనపాత కాళేశ్వరరావు, ప్రయాగ సుబ్రహ్మణ్యం, గోపాలాచార్యుల, అడబాల మరిడయ్య పాల్గొన్నారు.

లీలావతికి అకడమిక్ టైటాన్ ఎచీమెంట్ అవార్డు



రాజానగరం, మార్చి 3: రాజానగరం పరిధిలోని గైట్ అటానమస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.లీలావతి అకడమిక్ టైటాన్ ఎచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. ఇంజనీరింగ్, వైద్య రంగాల్లో విశేషంగా కృషి చేస్తున్న వారికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెడికల్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ సొసైటీ(ఏఐఎంఈఈఆర్ఎస్)ఆధ్వర్యంలో మేడ్చల్ మండలం గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కండ్లకోయలలోని సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్ వేదికగా ఈ వార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యారంగంలో ఆమె సాధిస్తున్న అభివృద్ధిని ప్రస్తావిస్తూ చైతన్య సంస్థల చైర్మన్ చైతన్య రాజు, గైట్ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కె.శశికిరణ్ వర్మ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.లక్ష్మీ శశివర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పీఎంఎంఎస్ శర్మ తదితరులు లీలావతిని అభినందించారు.

క్షమాపణ చెబితేనే రథోత్సవంలో పాల్గొంటాం

కోరుకొండ రథోత్సవం నిర్వాహకుల అల్టిమేటం

కోరుకొండ, మార్చి 3: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవం సందర్భంగా చక్రాలకు చెక్కలు వేసి రథాన్ని అదుపు చేస్తున్న వంశ పారంపర్య విశ్వబ్రాహ్మణ నిర్వాహకులపై సోషల్ మీడియా వేదికగా కించపరిచే వ్యాఖ్యలు చేయడం పట్ల వారు నిరసన తెలిపారు. ఈ మేరకు ఆదివారం స్వామి వారి దేవస్థానం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆలయ చైర్మన్ రంగరాజ భట్టర్ మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా విశ్వబ్రాహ్మణులు రథాన్ని అదుపు చేస్తున్నారని వారి మనోభావాలు దెబ్బతినే విధంగా సోషల్‌మీడియాలో వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. వారు ఏనాడు డబ్బు డిమాండ్ చేయలేదని, వారి సేవలను దేవస్థానం గుర్తించి తమకు తోచిన తాంబూలం ఇస్తున్నామన్నారు. కొచ్చెర్ల ఈశ్వరాచార్యులు, రుషికేష్ మాట్లాడుతూ తమ ఇంటికి వచ్చి క్షమాపణ చెప్పేవరకు స్వామి రథోత్సవంలో పాల్గొనబోమని తేల్చి చెప్పారు. ఇది తమ సంఘ పెద్దలు తీసుకున్న నిర్ణయమన్నారు. సమావేశంలో పలువురు రథోత్సవనిర్వాహకులు, విశ్వబ్రాహ్మణ సంఘ పెద్దలు పాల్గొన్నారు.

అభివృద్ధికి రోల్ మోడల్ బాలయోగి

వర్ధంతిలో టీడీపీ నేతలు గోరంట్ల, ఆదిరెడ్డి, గన్ని

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 3: బాలయోగిని లోకసభ స్పీకర్ స్థాయికి.. ప్రతిభా భారతిని శాసనసభ స్పీకర్‌ను చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. రాజమహేంద్రవరం కంబాలచెరువు పార్కులో ఉన్న దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి వర్ధంతి ఆయన ఆధ్వర్యంలో జరిగింది. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, టీడీపీ-జనసేన రాజమహేంద్రవరం ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, యర్రా వేణుగోపాలరాయుడు, కాశి నవీన్‌కుమార్, వర్రే శ్రీనివాసరావు, తలారి ఉమాదేవి, రాచపల్లి ప్రసాద్ బాలయోగి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.అభివృద్ధికి రోల్ మోడల్ బాలయోగి అన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: రాజమహేంద్రవరం వై.జంక్షన్‌లోని సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతిగృహం-1లో బాలయోగి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు కోరుకొండ చిరంజీవి, దారా యేసురత్నం, రైట్స్ ప్రొటెక్షన్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లూరి రాజేంద్రప్రసాద్, డీఎల్ఎస్ఏ సభ్యులు పాము బాబూరావు, వసతిగృహం అధికారులు దానవాయిబాబు, రాజేష్ పాల్గొన్నారు.